RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 04 సంచిక : 98 బుధవారం 14-08-2024 పేజీలు :04 వెల:రూ.2.00

విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

## అగ్రిగోల్డ్ భూముల విషయంలో అవకతవకలు

### సీఐడీ అటాచ్‌మెంట్‌లో అగ్రిగోల్డ్ ఆస్తులు

### ఏసీబీ అడిషినల్ ఎస్పీ సౌమ్యలత వెల్లడి

అమరావతి,ఆగస్ట్13: అగ్రిగోల్డ్ భూముల విషయంలో అవకతవకలు జరిగాయని ఏసీబీ అడిషినల్ ఎస్పీ సౌమ్యలత తెలిపారు. ఈ కేసులో జోగి రాజీవ్, మండల సర్వేయర్ రమేష్‌లను అరెస్టు చేశామని తెలిపారు. అగ్రిగోల్డ్ ఆస్తులు సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్నాయని, ఆ భూముల సర్వే నెంబర్‌ను మార్చారన్నారు. సీఐడీ అధికారుల నివేదికను కూడా తెప్పిస్తున్నట్టు వెల్లడించారు. పీసీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశామని, ప్రభుత్వ అధికారులు ఈ కేసులో దోషులుగా ఉన్నారని చెప్పారు. అందుకే తమ విచారణ వేరుగా సాగిస్తున్నట్టు తెలిపారు. సీఐడీ, ఏసీబీ అధికారుల విచారణ నివేదికలను ఉన్నతాధికారు లకు వివరిస్తామన్నారు. తమ దర్యాప్తులో ఐదుగురు పేర్లు ఉన్నాయని, విచారణలో మరి కొన్ని పేర్లు రావొచ్చన్నారు. జోగి రమేష్ పాత్రపై విచారణ జరుగుతోందని, ఆయన ప్రమేయంపై నిర్ధారణ అయితే కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు. 87 సర్వే నెంబరులో ఎలాంటి సబ్‌డివిజన్‌లు జరగలేదన్నారు. అవ్వా శేష నారాయణ ఫిర్యాదు మేరకు విచారణ ప్రారంభించామని, అక్రమ రిజిస్ట్రేషన్‌లు జరిగాయని తేలాకే కేసు నమోదు చేశామని చెప్పారు.

# రాష్ట్రంలో ఆహారశుద్ధి, ఆక్వా రంగాల ఆధారిత ఇండస్ట్రియల్ పార్కులు



ఒక్కోపార్క్ 100 ఎకరాల విస్తీర్ణంలో 100 పార్కులు ఏర్పాటు లక్ష్యం

విజయవాడ మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కులో పూర్తి స్థాయి కార్యకలాపాలు జరగాలి

ఉపాధి అవకాశాలు, సంపద సృష్టి కేంద్రాలుగా పోర్టుల నిర్మాణం

పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

అమరావతి ఆగస్టు 13: రాష్ట్రంలో ఆహారశుద్ధి, ఆక్వా, ఉద్యానవన రంగాలతో పాటు ఖనిజాధారిత పారిశ్రామికాభివృద్ధి పార్కులు ఏర్పాటుకు అనుకూల పరిస్థితులున్నందుకు వాటి ఏర్పాటుకు తగిన కార్యాచరణను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న పారిశ్రామికాభివృద్ధి పార్కుల్లో ఎన్ని అభివృద్ధి చేశారు, ఇంకా అభివృద్ధి చేసేందుకు అవకాశాలున్న వాటిపై పరిశీలన చేయాలని చెప్పారు. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని ఏరియా ఆధారిత ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఓడరేవులు, ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధికి సంబంధించి పరిశ్రమల శాఖ, ఎంఎస్ఎంఇ శాఖలపై సచివాల యంలో సీఎం మంగళవారం సమీక్షించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నపారిశ్రా మికాభివృద్ధి పార్కులు, కొత్తగా ఏర్పాటు కానున్న ఓడరేవులపై సంబంధిత శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సియంకు వివరించారు. ఈ సందర్భంగా సియం మాట్లాడుతూ ఆహారశుద్ధి, ఆక్వా, ఉద్యానవన రంగాలతో పాటు ఖనిజాధారిత ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేసేందుకు ఎక్కువ అవకాశాలను ఉన్నాయని అన్నారు. కావున వాటిని ఏర్పాటు చేసేందు కు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను అన్ని విధాలా ప్రోత్సహిం చేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఒక్కొక్క ఇండస్ట్రియల్ పార్క్ కనీసం 100 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 100 పార్కులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మహారాష్ట్ర అత్యధిక ఇండస్ట్రియల్ పార్కులను కలిగి దేశంలో అగ్రస్థానంలో ఉందని, మన రాష్ట్రంలో ప్రస్తుతం 53 ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయని రానున్న రోజుల్లో మరిన్ని పార్కులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన విజయవాడ మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కును పునరుద్ధరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో ఏయే ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందో అక్కడ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలను పోత్సహించాలన్నారు. రాష్ట్రంలో పీపీపీ విధానంలో ఇంటిగ్రేటెడ్ ఓడరేవుల అభివృద్ధికి తగిన మాస్టర్ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. దేశంలో ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహించబడుతున్న ఉత్తమ పోర్టులపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. దేశంలో రెండవ అతిపెద్ద సముద్రతీర ప్రాంతాన్నికలిగి ఉన్నందున ప్రస్తుతం ఉన్న పోర్టులతో పాటు మరిన్ని పోర్టులు ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. లాజిస్టిక్ పరమైన రోడ్లు, రైల్ కనెక్టివిటీతో పాటు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంత హింటర్ ల్యాండ్ అనుసంధానంతో కూడిన ఇంటిగ్రేటెడ్ ఓడరేవుల నిర్మాణం జరిగినప్పుడే ఎగుమతి ఖర్చులు తగ్గి ఉపాధి అవకాశాలు మెరుగు అవుతాయని చెప్పారు. ఆదిశగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇంటిగ్రేటెడ్ పోర్టుల ఏర్పాటుకై మాస్టర్ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్, రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్ శాఖా మాత్యులు కొండపల్లి శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి డా.ఎన్.యువరాజ్, సీయం అదనపు కార్యదర్శి కార్తికేయ మిశ్రా, పరిశ్రమల శాఖ కమిషనర్ సిహెచ్.శ్రీధర్, ఎపిఐఐసి ఎండి అభిషిక్త్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ పోర్టు అడ్డాగా అక్రమంగా బియ్యం తరలింపు

తనిఖీల్లో 26వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని స్వాధీనం

నోటీసులు ఇచ్చి బాధ్యులను అరెస్ట్ చేయిస్తాం

ఎంతటి వారైనా వదలబోమన్న మంత్రి నాదెండ్ల

కాకినాడ,ఆగస్ట్13: పౌరసరఫరాల శాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని ఎపి పౌరసరఫరాల శాఖ మంత్రి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వైకాపా పాలనలో ఓ కుటుంబం కాకినాడ పోర్టును అడ్డాగా మార్చుకొని, రేషన్ బియ్యం అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. కాకినాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్‌లో నిర్వహించిన తనిఖీల్లో 26వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. రేషన్ బియ్యం అక్రమాల కేసులో విచారణ కొలిక్కి వచ్చిందని తెలిపారు. ఈ కేసులో ఎంతటి వారున్నా వదిలే ప్రసక్తే లేదని, చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాకినాడ పోర్టు ఏర్పాటు చేసింది ఓ కుటుంబం కోసం కాదు.. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ కోసం. ఈ ప్రాంతానికి పెట్టుబడులు రావాలన్న ఉద్దేశంతోనే పోర్టును ఏర్పాటు చేశారు. కానీ, గత ఐదేళ్లలో ఇక్కడికి ఇతరులెవరూ రాకుండా వైకాపా నేతలు హుకుం జారీ చేసి, అక్రమాలకు పాల్పడ్డారు. మీడియా ప్రతినిధులకు అనుమతి లేకుండా చేశారు. ఇక్కడి రేషన్ బియ్యాన్ని.. నూకలు, ఉప్పుడు బియ్యం పేరుతో రీ ప్యాకింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేశారు. అక్రమాలకు పాల్పడిన వారెవ్వరినీ వదలం.. చట్టప్రకారం కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటాం.



త్వరలోనే 41ఏ ద్వారా నోటీసులిచ్చి అరెస్టు చేస్తాం. కాకినాడ పోర్టులో పని చేస్తున్న ఉద్యోగులు, హమాలీల సమస్యలను పరిష్కరిస్తాం' అని నాదెండ్ల తెలిపారు. అక్రమ రేషన్ బియ్యం రవాణా కాకినాడ పోర్టు ద్వారా జరిగిందని ఈ వ్యవహారంలో త్వరలో అరెస్టులుంటాయని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఉభయ గోదావరి జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం కాకినాడలో మంత్రి మనోహర్ పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పౌరఫరాలశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

## సుప్రీం మార్గదర్శకాల మేరకు నీటి వనరుల సమీపంలో ఉన్న ఆక్రమణలను తొలగించాలి

### జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా




కర్నూలు,ఆగస్టు ఆగస్టు 13: సుప్రీం మార్గదర్శకాల మేరకు నీటి వనరుల సమీపంలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వాటర్ బాడీస్ ఆక్రమణలపై కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు..మునిసిపల్ కమిషనర్లు, జలవనరుల శాఖ అధికారులు, డీపీఓ తో కలెక్టర్ ఈ అంశంపై చర్చించారు..ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆక్రమణలకు సంబంధించి జలవనరుల శాఖ, మున్సిపల్ అధికారులు నిర్లిప్తంగా ఉండకూడదన్నారు..ఆక్రమణల తొలగింపు పై ఆర్డీవో లతో చర్చించి, ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, అందుకు అనుగుణంగా ఆక్రమణలను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు..వాటర్ బాడీస్ వద్ద ఆక్రమణలు జరగకుండా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు.. ఆక్రమణలకు గురైన



వివరాలను రెవెన్యూ అధికారులకు అందచేయాలని కలెక్టర్ జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు..సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్వో మధుసూదన్ రావు,పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి,కర్నూలు మునిసిపల్ కమిషనర్ రామ లింగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎందరో నేతల పోరాట ఫలితం ఇది

### తిరంగా యాత్రను ప్రారంభించిన పురంధేశ్వరి

అమరావతి,ఆగస్ట్13: నేటి స్వాతంత్ర్య ఫలాలు ఆనాటి నేతల పోరాట ఫలితమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. స్వాతంత్ర్య చరిత్ర భవిష్యత్ తరాలకు తెలియచేయాలన్నారు. బీజేపీ ఎన్డీఏ పక్షాల భాగస్వామ్యంతో తిరంగా యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా యాత్రను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. దేశమంతా విద్యార్థులతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతి యావత్తు



ఒక పండుగ వాతావరణంలో నిర్వహించుకోవాలని అన్నారు. పార్టీలకు అతీతంగా దేశమంతా జాతీయ జెండాను ప్రతి ఇంటిపైన ఆవిష్కరించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి తిరంగా యాత్ర గురించి వివరించామన్నారు. జాతీయ జెండా చేత బూని తిరంగా యాత్రలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని పురందేశ్వరి వెల్లడించారు. రోవైపు ఈరోజు ఢిల్లీలోనూ తిరంగా యాత్ర చేమనున్నారు. భారత మండపం నుంచి ధ్యాన్‌చంద్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. తిరంగా యాత్రలో పలువురు ఎంపీలు పాల్గొననున్నారు. ఆగస్టు 9 నుంచి 15 వరకు ప్రతి ఇంట్లో త్రివర్ణ పతాకం ప్రదర్శించాలని... మువ్వన్నెల జెండాతో సెల్ఫీలను అప్‌లోడ్ చేసేందుకు వెబ్ సైట్ ను ఏర్పాటు చేశారు. 2022 నుంచి ఈ వెబ్‌సైట్ అందుబాటులో ఉంది. 2022లో 6 కోట్లు, 2023లో 10 కోట్ల మంది సెల్ఫీల అప్‌లోడ్ చేశారు. ఇప్పటికే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ డిస్‌ప్లే పిక్చర్‌ను మార్చి త్రివర్ణ పతాకాన్ని పెట్టారు. నేడు జరిగే త్రివర్ణ బైక్ ర్యాలీలో పాల్గొనాలని దేశంలోని ఎంపీలందరినీ కేంద్ర ప్రభుత్వం కోరింది. నేటి త్రివర్ణ బైక్ ర్యాలీలో పాల్గొనాలని అన్ని పార్టీల ఎంపీలకు విజ్ఞప్తి చేసింది.ఇది రాజకీయాలకు అతీతమైన అంశమని కేంద్రం పేర్కొంది. గతేడాది 23 కోట్ల ఇళ్లలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసినట్లు కేంద్రం పేర్కొంది.

## వైసీపీని రాజకీయంగా దెబ్బతీసేందుకే జోగి రమేష్ కుమారుడి అరెస్ట్ : మాజీ మంత్రి పేర్నినాని

అమరావతి : వైసీపీని రాజకీయంగా దెబ్బతీసేందుకు నాయకులు, కార్యకర్తలపై అధికార కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేస్తూ భయాందోళనలు సృష్టిస్తుందని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి పేర్నినాని ఆరోపించారు. సుదీర్ఘకాలంలో పార్టీకి నష్టం చేసేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్‌ని అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో ఏం తప్పు జరిగిందని ప్రశ్నించారు. చట్టానికి లోబడి జోగి రమేష్ రైతుల వద్ద భూములు కొనుగోలు చేసి తిరిగి రైతులకు విక్రయించారని, ఎక్కడా కూడా జోగి రమేష్ గాని, అతడు కుమారుడు గాని తప్పు చేయలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. అగ్రిగోల్డ్ భూములతో ఎలాంటి సంబంధం లేదని ఆరోపించారు.ముందస్తు విచారణ లేకుండా జోగిరమేష్ కొడుకును అరెస్టు చేశారని తెలిపారు. అక్రమ కేసులు పెట్టి మానసిక వేధింపులకు గురి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వెల్లడించారు. ఎంతమందిని అరెస్టు చేసినా వైసీపీ పోరాటాలకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. టీడీపీ చేస్తున్న తప్పులను అడుగడుగునా నిలదీస్తాం. న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు.

## ఇస్రో శాస్త్రవేత్తలు మనిషి రూపంలో ఉన్న దేవుళ్లు

### : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి : భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తెస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలకు హ్యాట్సాఫ్, నా సెల్యూట్ అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్అన్నారు. వారు కంటికి కనిపించే దేవుళ్లని ప్రశంసించారు. నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో జరిగిన ప్రపంచ అంతరిక్ష ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికను అందిపుచ్చుకుని ఒకే రాకెట్ నుంచి వందకు పైగా ఉపగ్రహాలు విదేశాలకు సంబంధించిన ఉపగ్రహాలను సతీష్ ధావన్ కేంద్రం నుంచి పంపడం చంద్రునిపైకి పంపడం అభినందనీయమని అన్నారు.విజయవంతంగా ఉపగ్రహాలను పంపి ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఇస్రోకు రుణపడాలని, సైంటిస్టులు భారతదేశానికి నిజమైన హీరోలని కొనియాడారు. నాకు కూడా చిన్నప్పటి నుంచి శ్రీహరి కోటాకు రావాలని అనుకునేవాడని, అది ఇప్పుడు నెరవేరిందని అన్నారు. చదువుకునే రోజుల్లో అంతరిక్షం గురించి టీచర్లను అడిగేవాడినని గుర్తు చేస్తుకున్నారు.



## ఎపిలో మెడికల్ కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ కోటా

### సీట్ల కేటాయింపు జీవోను నిలిపివేసిన హైకోర్టు

అమరావతి,ఆగస్ట్13: ఓవైపు తెలంగాణలో మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలపై వివాదం నెలకొంది. స్థానికత తేల్చాలని, తమకు అన్యాయం జరుగుతోందని హైకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన కొత్త జీవోతో స్థానికతపై వివాదం ముదురుతోంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ లోనూ వైద్యకళాశాలల్లో ప్రవేశాలు గందరగోళంగా మారాయి.



ఏపీలో మెడికల్ కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ కోటా సీట్ల కేటాయింపు జీవోను ఏపీ హైకోర్టు నిలిపివేసింది. ఈ మేరకు మంగళవారం ఏపీ హైకోర్టు ఈడబ్ల్యూఎస్ కోటా జీవో నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లకు సంబంధించిన జీవోను సవాలు చేస్తూ కొందరు విద్యార్థులు పిటిషన్ దాఖలు చేశారు. ఏపీ హైకోర్టులో ఆ పిటిషన్లపై విచారణ జరిగింది. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో సీట్ల సంఖ్య పెంచకుండానే జోవో ఇచ్చారని, ఆ నిర్ణయం తీసుకున్నాకే.. ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లు భర్తీ చేయాలని పిటిషనర్ తరఫు లాయర్ హైకోర్టులో వాదనలు వినిపించారు. అలా జరగని పక్షంలో ఓపెన్ కేటగిరీ (క్షూ।ని అజీబి।ణనీసా) విద్యార్థులు నష్టపోయే అవకాశాలు అధికమని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలు విన్న అనంతరం ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లకు సంబంధించిన జీవోను నిలిపివేస్తూ రాష్ట్ర హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# సంపాదకీయం

బుధవారం 14-08-2024

## విశ్వ క్రీడల్లో వివాదాలు

పారిస్ ఒలింపిక్స్‌ను కొన్ని వివాదాలు చుట్టుముట్టాయి. లింగ అర్హత, డ్రగ్స్, యాంటీ సెక్స్ బెడ్‌లు, బాక్సింగ్ పాయింట్లు ఇలా ఎన్నో వివాదాలు విశ్వ క్రీడల్లో జరిగాయి. డ్రగ్స్ కొనేందుకు యత్నించిన ఆస్ట్రేలియ హాకీ జట్టు ఆటగాడు టామ్ క్రెయిగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్రెయిగ్‌ను విచారణ కోసం యాంటీ డ్రగ్ విభాగానికి అప్పగించినట్లు పారిస్ ప్రాసిక్యూటర్ కార్యాలయం వెల్లడించింది. ఈ ఘటనపై క్రెయిగ్ క్షణాపణలు చెప్పాడు. తాను ఘోరమైన తప్పు చేశానని... తన చర్యకు పూర్తి బాధ్యత వహిస్తానని తెలిపాడు. లైంగిక వేధింపుల ఆరోపణలపై ఈజిప్టుకు చెందిన 26 ఏళ్ల ఒలింపిక్ రెజ్లర్ మొహమ్మద్ ఇబ్రహీంను అరెస్టు చేసినట్లు ఫ్రెంచ్ ప్రాసిక్యూటర్లు తెలిపారు. మొహమ్మూద్ టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకున్నాడు. పారిస్ కేఫ్ వెలుపల వెనుక నుంచి ఒక మహిళను పట్టుకున్నందుకు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పారిస్ ప్రాసిక్యూటర్లు తెలిపారు. స్వదేశానికి వెళ్లే కొద్ది గంటల ముందు మొహమ్మూద్ ఈ పని చేశాడుఒలింపిక్ విలేజ్ నుంచి అందంగా ఉందన్న కారణంతో పరాగ్వే స్విమ్మర్ లువానా అలోన్సోను పంపించేయడం కూడా వివాదం రేపింది. ఆమె అందం కారణంగానే బయటకు పంపిచారనే ప్రచారం జరిగింది. ఆమె అందంతో జట్టులోని ఇతర ఆటగాళ్లను తప్పుదోవ పట్టిస్తోందన్న కారణంతో అలోన్సోను స్వదేశానికి పంపించేశారు. ఆమె పరాగ్వే జట్టులో అనుచితమైన వాతావరణాన్ని సృష్టించిందని పరాగ్వే ఒలింపిక్ కమిటీ వెల్లడించింది. పారిస్ ఒలింపిక్స్‌లో ఓ అథ్లెట్‌కు ఊహించని విధంగా ఓటమి ఎదురైంది. పురుషుల పోల్ వాల్ట్ ఈవెంట్లో పురుషాంగం తగిలి... ఫ్రెంచ్ అథ్లెట్ ఆంథోనీ అమ్మిరాటికి పతకం చేజారింది. జంప్ చేస్తున్నప్పుడు జననాంగం పోల్‌కు తగిలడంతో అతను నాలుగో స్తానంలో నిలిచాడు. అయితే ఇదే ఇప్పుడు అంథోనీకి పోర్న్ సినిమాల్లో బోలెడు ఆఫర్లను తెచ్చిపెట్టింది. పోర్న్ సినిమాల్లో నటిస్తే 2, 50,000 డాలర్లు ఇస్తామని కూడా అంథోనీకి ఆఫర్ లెటర్ వచ్చింది. అయితే అతడు దానికి పెద్దగా ఇంట్రెస్ట్ చూపలేదు. ఈ ఒలింపిక్స్‌లో లింగ అర్హత వివాదం తీవ్ర కలకలం రేపింది. సాక్షాత్తూ ఇటలీ ప్రధాని మెలోని కూడా దీనిపై స్పందించాల్సి వచ్చింది. మహిళల కుస్తీల్లోకి ఎక్స్, వై క్రోమోజోమ్‌లు ఉన్న అథ్లెట్లను ఎలా అనుమదిస్తారని చాలామంది ప్రశ్నించారు. టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ మొత్తం 7 పతకాలు సాధించే అవకాశం ఉన్నా.. కేవలం 6 పతకాలు మాత్రమే గెలుచుకోగలిగింది. అయితే ఈ ఒలింపిక్స్‌లో భారత్ మరో 7 పతకాలు సాధించి ఉండేది. కానీ, ఈ పతకాలు తృటిలో మిస్ అయ్యాయి. గల్లంతైన ఆ 7 పతకాల వివరాలు ఎలా ఉన్నాయో ఓసారి చూద్దాం. ఈ ఒలింపిక్స్‌లో మను భాకర్ అద్భుత ప్రదర్శన చేసి 2 కాంస్య పతకాలు సాధించింది. అయితే, మను భాకర్ పతకం సాధించే అవకాశం ఉంది. ఆమె 25 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్ పోటీలో పతకం సాధించలేదు. కానీ, తృటిలో పతకం సాధించే అవకాశాన్ని కోల్పోయింది. బ్యాడ్మింటన్ క్రీడల్లో భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ సెమీఫైనల్‌కు చేరాడు. సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఓడిపోవాల్సి వచ్చింది. ఆ తర్వాత కాంస్య పతక మ్యాచ్‌లో ప్రారంభంలోనే ఆధిక్యం సాధించాడు. ఆపై తన లయను కోల్పోయాడు. 13-21, 21-16, 21-11 తేడాతో మలేషియాకు చెందిన లీ జి జియా చేతిలో ఓడిపోయాడుమహేశ్వరి చౌహాన్, అనంత్‌లకు షూటింగ్ పోటీల్లో భారత్ తరపున పతకం సాధించే అవకాశం లభించింది. కాంస్య పతక పోరులో రెండు జోడీలు చైనాకు చెందిన జియాంగ్ యుటింగ్, లియు జియాలిన్‌లతో తలపడ్డాయి. కానీ కేవలం 1 పాయింట్ తేడాతో భారత్ పతకాల ఆశలు అడియాశలయ్యాయి. చివరికి ఈ జంట నాలుగో స్థానంలో నిలిచింది. మహేశ్వరి చౌహాన్, అనంత్‌లకు షూటింగ్ పోటీల్లో భారత్ తరపున పతకం సాధించే అవకాశం లభించింది. కాంస్య పతక పోరులో రెండు జోడీలు చైనాకు చెందిన జియాంగ్ యుటింగ్, లియు జియాలిన్‌లతో తలపడ్డాయి. కానీ కేవలం 1 పాయింట్ తేడాతో భారత్ పతకాల ఆశలు అడియాశలయ్యాయి. చివరికి ఈ జంట నాలుగో స్థానంలో నిలిచిందిమిక్స్‌డ్ ఆర్చరీ టీమ్‌లో ధీరజ్ బొమ్మదేవర, అంకిత భకత్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. కాంస్య పతక పోరులోనూ ఈ జోడీ ఆడింది. ఈ మీట్‌లో భారత్‌కు మరో పతకం వస్తుందని అంతా భావించారు. కానీ, అమెరికాకు చెందిన కేసీ కౌఫోల్డ్, బ్రాడీ ఎలిసన్ 2-6తో ధీరజ్ బొమ్మదేవర, అంకితా భకత్ జోడీని ఓడించి పతకం సాధించాలనే భారత్ కలను నీరుగార్చారు. ఇక్కడ కూడా ఈ భారత జోడీ నాలుగో స్థానం దక్కించుకుంది. భారత షూటర్ అర్జున్ బాబుటాకు కూడా పతకం సాధించే అవకాశం వచ్చింది. అతను 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో కాంస్య పతక మ్యాచ్ ఆడాడు. అయితే, క్రొయేషియా ఆటగాడు మారిసిక్ మిరాన్ చేతిలో అర్జున్ ఓడిపోయాడు. దీంతో భారత్ మరో పతకం సాధించాలన్న కల చెదిరిపోయింది. భారత స్టార్ మహిళా అథ్లెట్ మీరాబాయి చాను నుంచి దేశంలోని కోట్లాది మంది క్రీడాభిమానులు పతకం ఆశించారు.

# కొత్త మద్యం పాలసీ...

విజయవాడ, ఆగస్టు 13 ఏపీలో ప్రభుత్వ మద్యం దుకాణాలకు మంగళం పాడాలనే నిర్ణయానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చినట్టు కనిపిస్తోంది. ప్రైవేట్ దుకాణాలనను అక్టోబర్ నుంచి వచ్చే కొత్త మద్యం పాలసీలో ప్రవేశపెట్టేందుకు సిద్ధం అవుతోంది. ఏపీలో గత ఐదేళ్లుగా రకరకాల బ్రాండ్లను ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయించినా జనం మరో దారి లేక వాటినే కొనుగోలు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు రెట్లు ధరలు పెంచిన ప్రభుత్వం మద్యం తయారీదారుల్ని తన దారిలోకి తెచ్చుకోడానికి రకరకాల అస్త్రాలు ప్రయోగించింది. ఈ క్రమంలో మద్యం మీద కళ్లు చెదిరే ఆదాయం కూడా ప్రభుత్వానికి వచ్చింది. మద్యం డిస్టిలరీలు, అమ్మకాలు, నగదు చెల్లింపులు మాత్రమే చేసినా ప్రభుత్వానికి ఏటా రూ.36వేల కోట్ల ఆదాయం వచ్చింది. 2018-19 నాటికి ఈ ఆదాయం రూ.18వేల కోట్లు మాత్రమే ఉండేది. కేవలం ధరల ఆధారంగానే మద్యం అమ్మకాలు జరిగినా జనం జేబులు ఖాళీ చేసుకుంటూ నాసిరకం మద్యాన్ని విధిలేని పరిస్థితుల్లో కొనుగోలు చేసేవారు. 2019 నాటికి రూ.100లోపు ధర ఉన్న ఐఎంఎఫ్ఎల్ మద్యం ధర దాదాపు రెట్టింపు అయ్యింది. పాపులర్ బ్రాండ్లు మొత్తం కనుమరుగై పోయాయి. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం మద్యం ధరల్ని గాడిన పెడుతుందని భావిస్తే మళ్లీ ప్రైవేట్ దుకాణాలను తెచ్చేందుకు ఉత్సాహం చూపడం పలు అనుమానాలకు తావిస్తోంది. మద్యం ధరల్ని గణనీయంగా తగ్గిస్తామనే ప్రకటన ప్రజలకు ఊరటనిచ్చినా ప్రైవేట్ దుకాణాలతో లాభం ఎవరికనే సందేహాలు లేకపోలేదుమద్యం తయారీ మొదలు విక్రయాల వరకు ప్రతి పైసాకు నాలుగైదు రెట్లు లాభాలు ఉండటాయి. దీంతో కొత్త మద్యం పాలసీపై లిక్కర్ సిండికేట్లు కన్నేశాయి. ఐదేళ్లుగా మద్యం విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయం చాలా వరకు ప్రభుత్వ ఖజానాకు చేరింది. ప్రభుత్వం విక్రయించిన మద్యం నాణ్యత, ధరలపై ఎన్ని విమర్శలు ఉన్నా మద్యం ద్వారా లభించిన ఆదాయం మాత్రం గణనీయంగా పెరిగింది. ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త లిక్కర్ పాలసీ ప్రవేశ పెడుతుందనే వార్తల నేపథ్యంలో లిక్కర్ సిండికేట్లు జోరుగా ప్రయత్నాలు మొదలు పెట్టాయి. ఇప్పటికే ప్రైవేట్ దుకాణాల ఏర్పాటులో అవి సక్సెస్ అయ్యాయి. వీలైనన్ని మద్యం దుకాణాలను దక్కించుకోడానికి సిండికేట్లు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఐదేళ్లుగా ప్రభుత్వమే నేరుగా మద్యాన్ని విక్రయించడంతో ఆదాయాన్ని కోల్పోయిన వ్యాపారులు, రాజకీయ నాయకులు, డిస్టిలరీలు కుమ్మక్కై కొత్త పాలసీని ప్రభావితం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఏపీలో మద్యం విక్రయాలను మించిన ఆదాయ మార్గం ప్రభుత్వానికి మరొకటి లేదు. ఏటా రూ.36వేల కోట్ల రుపాయల ఆదాయం ఖజానాకు లభిస్తోంది. నాలుగో వంతు ఉత్పాదక వ్యయంగా పోయినా దాదాపు రూ.27వేల కోట్ల రుపాయలు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయంగా లభించేది. 2019కు ముందు మద్యం ద్వారా ప్రభుత్వానికి సమకూరిన ఆదాయంలో మద్యం దుకాణాలు కూడా భారీగానే లాభపడ్డాయి. ఐదేళ్ల క్రితం వైసీపీ సంపూర్ణ మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే మద్యం ధరల్ని గణనీయంగా పెంచేసింది. 2019 ధరలకు రెండు రెట్లు ధరలు పెంచడంతో వినియోగదారులు ఇతర మార్గాలను అన్వేషించారు. పొరుగు రాష్ట్రాల నుంచి భారీగా అక్రమ మద్యం రవాణా అయ్యేది. అక్రమ రవాణా నిరోధంతో పాటు నాటుసారా తయారీని అరికట్టడానికి సెబ్ పేరిట ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇవేమి ప్రభుత్వం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ఫలితంగా మద్యం ధరల్ని కొంత తగ్గించారు. అయితే నాణ్యత విషయంలో తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. 2019కు ముందు మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంలో చాలా భాగం రాజకీయ నాయకుల జేబుల్లోకి వెళ్లిపోయేది. మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వమే చేపట్టడం ద్వారా రాష్ట్రానికి మేలు జరిగింది. గతంలో మద్యం తయారీ దారులు, విక్రయదారులు, లీజుదారులు, రాజకీయ నాయకులు సిండికేట్‌గా ఏర్పడి మద్యం దుకాణాలను తమ గుప్పెట్లో పెట్టుకునే వారు. 2019 నుంచి వీటికి అడ్డుకట్ట పడింది. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీలో లాభనష్టాలు రెండూ ఉన్నాయి. ప్రభుత్వమే నేరుగా మద్యం విక్రయించే విధానం చాలా కాలం క్రితమే ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ఉంది. ఢిల్లీలో ఇటీవల లిక్కర్ పాలసీ స్కామ్ రాకముందు వరకు సమర్ధవంతంగా ప్రభుత్వ దుకాణాల వ్యవస్థ నడిచేది. దీని వల్ల కల్తీ మద్యం, నాసిరకం విక్రయాలకు అవకాశం ఉండేది కాదు. ఏపీలో కూడా ఈ తరహా దుకాణాలను ప్రవేశపెట్టిన మరో పద్ధతిలో అక్రమాలు జరిగాయి. పూర్తిగా నగదుతోనే మద్యం విక్రయించడం, కొన్ని బ్రాండ్లను మాత్రమే అనుమతించడం ద్వారా కావాల్సిన వారికి మాత్రమే మద్యం అమ్ముకునే అవకాశం కల్పించారు. కొత్త మద్యం పాలసీ రూపకల్పన నేపథ్యంలో లిక్కర్ సిండికేట్ల ఒత్తిళ్లకు తలొగ్గితే చంద్రబాబు ప్రభుత్వం విమర్శలకు గురయ్యే అవకాశం ఉంది. మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని కోల్పోవడానికి కారణమయ్యారనే నిందను మోయాల్సి రావచ్చు. సాధారణంగా ఏ ఆహార ఉత్పత్తినైనా తయారీదారుడే స్వయంగా విక్రయించుకునే అవకాశం ఉంటుంది. కేవలం మద్యం తయారీకి మాత్రమే వారికి ప్రభుత్వం అనుమతి ఇస్తుంది. విక్రయాలను మాత్రమే ప్రభుత్వమే నిర్వహిస్తుంది. డిస్టిలరీలు తయారు చేసిన మద్యాన్ని బేవరేజీస్ కార్పొరేషన్ ద్వారా దుకాణాలకు సరఫరా చేసేవారు. ఉత్పాదక వ్యయం కంటే 100 నుంచి 200శాతంపన్నులు వేసి బ్రాండ్లను బట్టి నాణ్యత ఆధారంగా మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. ఇందులో గరిష్టంగా 8శాతం వరకు దుకాణాలకు కమిషన్‌గా వెళ్లేది. గతంలో 2019 వరకు వేలం పాట ద్వారా నిర్దిష్ట కాలపరిమితికి దుకాణాలను కేటాయించే వారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా విక్రయాలు జరుగుతున్నాయి. 2018-19లో దాదాపు రూ.16-18వేల కోట్లుగా ఉన్న మద్యం ఆదాయం ఐదేళ్లలో రూ.36వేల కోట్లకు చేరింది. ఇందులో ఉత్పాదక వ్యయం, కమిషన్లు పోగా ప్రభుత్వానికి భారీగానే ఆదాయం సమకూరింది. అయితే డిస్టిలరీను గత ప్రభుత్వంలో పెద్దలు చేజిక్కించుకుని భారీగా లాభపడ్డారనే విమర్శలు ఉన్నాయి. మద్యం వ్యాపారాల్లో సుదీర్ఘ కాలంగా ఉన్న రాజకీయ నాయకులు కూడా ఒత్తిళ్లను తట్టుకోలేక వ్యాపారాల నుంచి పక్కకు తప్పుకున్నారని ప్రచారం జరిగింది. 2019 వరకు అందుబాటులో ఉన్న బ్రాండ్ల స్థానంలో రకరకాల కొత్త ఉత్పత్తులు అమ్మకాలకు వచ్చాయి. జనం తాము కోరుకున్న మద్యాన్ని కాకుండా ప్రభుత్వం విక్రయించిన దానిని మాత్రమే కొనే పరిస్థితి కల్పించారు. వైసీపీ ఓటమికి ఇదే ప్రధాన కారణమైంది. మద్యం ధరలు భారీగా పెరగడం, నాసిరకం బ్రాండ్లను విక్రయించడంతో ప్రజల్లో విస్తృత చర్చ జరిగింది. సాధారణంగా ఏ ఉత్పత్తినైనా ఎంత ధరకు విక్రయించాలనేది తయారీదారుడే నిర్ణయిస్తాడు. మద్యం మాత్రం ఏ బ్రాండ్ ఎంతకు అమ్మాలనేది ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీ నిర్ణయిస్తుంది. దీని చట్టబద్ధతపై కూడా సందేహాలున్నాయి. మద్యం నాణ్యతను, రసాయినిక ప్రమాణాలను నిర్ణయించే అధికారం మాత్రమే ప్రభుత్వ కమిటీలకు ఉండగా ధరలను కూడా వారే నిర్ణయించే పరిస్థితి చాలా కాలంగా ఉంది. మద్యం ఆదాయం ప్రభుత్వానికి వస్తుండటంతో దీనిని ప్రశ్నించిన వారు కూడా లేరు. మద్యం విక్రయాలను గతంలో మాదిరి దుకాణాలకు అప్పగిస్తే దాంట్లో భారీగా అక్రమాలు జరిగే అవకాశం ఉంటుంది. మద్యం దుకాణాలు-రాజకీయ నాయకులు-డిస్టిలరీలు కుమ్మక్కవుతాయి. దుకాణాలకు మద్యం విక్రయాలతో వచ్చే 8శాతం కమిషన్‌లోనే షాపుల అద్దెలు, సిబ్బంది జీతాలు, ఎక్సైజ్ సిబ్బందికి మామూళ్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఏ మాత్రం లాభదాయకం కాకపోయినా మద్యం సిండికేట్లు దుకాణాలు కావాలని ఒత్తిళ్లు పెంచడం వెనుక పెద్ద దందా ఉంటుంది. డిస్టిలరీలు బేవరేజీస్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వానికి సరఫరా చేసే మద్యంతో పాటు నేరుగా దుకాణాలకు సరఫరా చేస్తుంటాయి. మద్యాన్ని 20-30శాతం కల్తీ చేయడం ద్వారా లాభాలను పెంచుకుంటారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రాంతాల వారీగా మద్యం దుకాణాలను దక్కించుకునే వారు బెల్టు షాపుల ద్వారా అమ్మకాలు పెంచుకుంటారు. ఇదంతా ఓ దోపిడీ చైన్‌గా మారుతుంది. మద్యం రిటైల్ వ్యాపారంలో ప్రభుత్వం ఉండటం వల్ల దోపిడీకి అడ్డుకట్ట పడుతుంది. అదే సమయంలో అన్ని బ్రాండ్లను అందుబాటులో ఉంచితే ఏ బ్రాండ్‌ను కొనుగోలు చేయాలనే విచక్షణ వినియోగదారుడికి లభిస్తుంది.

ఫలితంగా నాణ్యత విషయంలో కూడా కంపెనీలు రాజీపడకుండా ఉంటాయి. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా కొన్ని బ్రాండ్ల లభ్యతే అధికంగా ఉంటుంది. బ్రాండ్లను ఎంచుకునే స్వేచ్ఛ వినియోగదారుడికి ఉండదు. గతంలో పాపులర్ బ్రాండ్ల విక్రయాలు ఎక్కువగా జరిగేవి. ప్రభుత్వ మద్యం దుకాణాలతో ఈ సమస్య పరిష్కారం కాకపోగా దుకాణాలముందుక్యూలైన్లలోపడిగాపులుపడేపరిస్థితి కల్పించారు. ప్రభుత్వానికి మద్యం నాణ్యతను నిర్ధారించడం, నాణ్యతా ప్రమాణాలను పాటించేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత మాత్రమే ఉంటుంది. అయా డిస్టిలరీలు ఇచ్చే ఇథనాల్ ఫార్ములా ఆధారంగా వాటికి అనుమతులు, ధరలను నిర్ణయిస్తుంటాయి. గత కొన్నేళ్లుగా కమిటీల పేరుతో లిక్కర్ డిస్టిలరీలను లొంగదీ సుకోవడంపైనే ప్రభుత్వాలు దృష్టి సారించాయి. మద్యం తయారీ, నాణ్యత, కొత్త బ్రాండ్లకు అనుమతించే విషయంలో రాజకీయ నాయకుల ఒత్తిళ్లు పనిచేస్తున్నాయి. అన్ని బ్రాండ్లను అనుమతించి, కోరుకున్న బ్రాండ్ ఎంచుకునే స్వేచ్ఛ మద్యం సేవించే వారికి ఇస్తే చాలా వరకు సమస్యలు తగ్గుతాయనే వాదన ఉంది. లిక్కర్ మార్ట్‌ల సంఖ్యను పెంచడం ద్వారా ప్రభుత్వ వ్యాపా రాన్ని పెంచు కోవచ్చనే సూచనలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న మద్యం దుకాణాల నిర్వహణ విధుల్లో గ్రామ, వార్డు సచివాలయాల్లో అదనంగా ఉన్న సిబ్బందిని వినియోగించుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది గతంలో మద్యం దుకాణాల్లో పనిచేసిన వారు కావడంతో ఐదేళ్లలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి.

# ఇక అమరావతి పరుగులే

విజయవాడ, ఆగస్టు 13,అమరావతి రాజధాని నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత.. అమరావతి పై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. ఫలితాలు వచ్చిన మరుక్షణం నుంచి అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభమయ్యాయి. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం, మంత్రులు ప్రమాణ స్వీకారం చేసిన నాటికి అమరావతికి కొత్త కళ వచ్చింది. ప్రాథమికంగా జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తయ్యాయి. ప్రధాన రహదారులలో విద్యుత్ లైట్లు వెలిగి కొత్త కళ సంతరించుకుంది. అదే సమయంలో సీఎం చంద్రబాబు విన్నపం మేరకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో 15 వేల కోట్ల రూపాయలు కేటాయించింది. అయితే ఇది రుణమా? గ్రాంటా? అన్న విషయంలో కొంత వివాదం నెలకొంది. అయితే ప్రపంచ బ్యాంకు నిధులను తామే సర్దుబాటు చేసినట్లు కేంద్రం ప్రకటించింది. దీనికి తామే గ్యారెంటీ అని కూడా స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు పావులు కాదపడం ప్రారంభించారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందాన్ని అమరావతికి రప్పించారు. వారి ముందు కీలక ప్రతిపాదనలు పెట్టారు. సిఆర్డిఏ బృందం రూపొందించిన ఒక ప్రత్యేక ప్రణాళికను, వ్యూహాన్ని ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల ఎదుట పెట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రపంచ బ్యాంకు బృందం అమరావతిలో విస్తృతంగా పర్యటిస్తోంది. రాజధాని పరిధిలో కట్టడాలు, ఇతర నిర్మాణాలు, ప్రస్తుత స్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోంది. ఈ సందర్భంగా అమరావతికి కావాల్సిన రుణంపై కూడా చర్చలు కొనసాగించినట్లు తెలుస్తోందిఅమరావతిలో నవ నగరాలు నిర్మించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దాదాపు 33 వేల ఎకరాలను రైతుల నుంచి సమీకరించగా.. మరో 21 వేల ఎకరాలు ప్రభుత్వ భూమిని కలుపుకొని.. 54 వేల ఎకరాల్లో అమరావతిని ప్రపంచానికే తలమానికంగా కట్టాలన్నది ప్లాన్. అయితే గత ఐదేళ్ల వైసిపి పాలనలో అమరావతి రాజధాని నిర్వీర్యం అయ్యింది. దానిని యథాస్థితికి తెచ్చి పనులు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోందిబెంగళూరు తో పాటు హైదరాబాద్ ఐఐటి నిపుణులు ఇటీవల అమరావతి నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఇంకోవైపు అమరావతిలోని 54 వేల ఎకరాల్లో జంగిల్ క్లియరెన్స్ పనులకు గాను 36 వేల కోట్లతో టెండర్లు పూర్తయ్యాయి. పనులు కూడా ప్రారంభమయ్యాయి. 45 రోజుల్లో అమరావతిని యధాస్థానానికి తీసుకొచ్చేందుకు లక్ష్యంగా ఈ పనులు జరుగుతున్నాయి. ఇంతలో ప్రపంచ బ్యాంకు నుంచి కేంద్రం సర్దుబాటు చేసిన 15 వేల కోట్లతో పాటు కొంత మొత్తం రుణం పొందాలని చంద్రబాబు సర్కార్ భావిస్తోంది. 2050 నాటికి అమరావతి రాజధాని రూపును అంచనా వేసుకుని.. అవసరాలకు తగ్గట్టు నిర్మాణాలు చేపట్టాలని సిఆర్డిఏ భావిస్తోంది. అందుకు అవసరమైన కీలక ప్రాజెక్టులను ప్రపంచ బ్యాంకు ఎదుట పెట్టింది. వాటికి సాయం చేయాలని అడిగింది. ముఖ్యంగా రోడ్లు, యుటిలిటీ కారిడార్లు, సీనరేజ్, విలేజ్ రోడ్లు, కనెక్టివిటీ, ట్రంక్‌న్ఫ్రాస్ట్రక్చర్, వరద ముంపు నివారణ కాలువల మెరుగుదల.. వంటి వాటికి నిధులు ఇవ్వాలని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులను కోరారు. కనీసం 40 వేలకోట్ల అవసరం ఉందని అంచనా వేస్తూ ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల ఎదుట ప్రతిపాదనలు ఉంచారు సిఆర్డిఏ అధికారులు. దీనికి ప్రపంచ బ్యాంకు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

# వినూత్న వేదికతో పరిటాల

అనంతపురం, ఆగస్టు 13 మాజీ మంత్రి పరిటాల సునీత ప్రజాసమస్యల పరిష్కారం కోసం వినూత్నంగా ముందుకెళ్తున్నారు. ప్రతి రోజు సమస్యలు చెప్పుకునేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు వెంకటాపురం లేదా అనంతపురం తరలివస్తున్నారు. ఇది ప్రజలకు ఒకింత భారంగా మారింది. అందుకే ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని పరిటాల సునీత భావించారు. ఇందులో భాగంగా తొలిరోజు చెన్నేకొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చి తమ సమస్యల్ని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి ఒక్కరితో నేరుగా సునీత మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఓపికగా వారి సమస్యలు విన్నారు. ఇందులో ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో తమ భూములను వైసీపీ నాయకులు దౌర్జన్యంతో ఆక్రమించారని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నో ఏళ్ల నుంచి తాము సాగులో ఉన్నప్పటికీ.. ఆన్ లైన్ లో నుంచి తొలగించి వైసీపీ నాయకులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని ఎమ్మెల్యే ముందు వాపోయారు. తమ భూములు తమకు దక్కేలా చూడాలని విన్నవించారు. పింఛన్లు పొందేందుకు అర్హత ఉన్నప్పటికీ తమకు ఇవ్వడంలేదని కొందరు.. గతంలో వచ్చే పింఛన్లను తొలగించారని మరికొందరు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రేషన్ కార్డుల విషయంలో కూడా ఇలాంటి ఫిర్యాదులే వచ్చాయి. వీటిపై కనీసం ఇప్పుడైనా తమకు న్యాయం చేయాలని పలువురు వినతులు అందజేశారు. చెన్నేకొత్తపల్లి గ్రామంలో పశువుల సంత ఏర్పాటు చేయాలని.. బీసీ కాలనీలో ఆలయ నిర్మాణం, స్థానిక ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, వైద్యులను నియమించాలని ప్రజలు ఎమ్మెల్యేకు వినతి పత్రాలు సమర్పించారు. తాగునీటి సమస్య, నూతన గృహాలు మంజూరు తదితర సమస్యలు ఎక్కువగా కనిపించాయి. వీటిలో కొన్నింటినీ తక్షణమే పరిష్కరించాలని అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలిచ్చారు. మరికొన్నింటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. బడ్జెట్ కు సంబంధించిన అంశాలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పనులు చేపడుతామని సునీత అన్నారు. ఇక నుంచి ప్రతి మండలంలోనూ గ్రీవెన్స్ నిర్వహిస్తామని.. ప్రజలు వారి మండలానికి వచ్చినప్పుడు సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. కనగానపల్లిలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నారు.

# గ్యారంటీలపై నోరు మెదపరేం...

నెల్లూరు, ఆగస్టు 13, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నికలకు ముందు ఎంత దూకుడుగా ఉండేవారో ఇప్పుడు సాధుజీవిగా మారారు. అసలు మాట్లాడటమే మానేశారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ఆయన ప్రశ్నించలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఎవరికైనా బయట ఉండి చూస్తే అంతా బాగానే కనిపిస్తుంది. అలాగే లోపలికి వచ్చి చూస్తే కాని అసలు విషయం తెలియదంటారు. అదే పవన్ కల్యాణ్ విషయంలో నిజమయిందంటున్నారు. అధికారంలో లేనపుడు పదే పదే ప్రశ్నించిన పవన్ కల్యాణ్.. అధికారంలోకి రాగానే ఇప్పుడు అసలు విషయం అర్థమయినట్లుంది. అసలు పాలన ఎంత కష్టమో ఆయనకు బోధపడినట్లుంది. విడిపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే తమ కూటమి వల్లే సాధ్యమవుతుందని ఎన్నికలకు ముందు పదే పదే పవన్ కల్యాణ్ చెప్పారు. తమ కూటమి ఇచ్చిన హామీలకు తాను భరోసా ఇస్తున్నానని, తాను దగ్గరుండి వాటిని అమలు చేయిస్తానని పదే పదే బహిరంగ సభల్లో చెప్పుకొచ్చారు జనసేనాని. సూపర్ సిక్స్ గాని, ఎన్నికలకు ముందు విడుదల చేసిన టీడీపీ, జనసేన మ్యానిఫేస్టోలో అంశాల విషయంలో కానీ ఆయన తనది గ్యారంటీ అని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన తర్వాతనే తన పని తాను చూసుకుంటానని, తనను నమ్మాలంటూ ఆయన ప్రజలను పలు బహిరంగ సభల్లో కోరడం కూడా వినిపించింది. కనిపించింది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత తత్వం బోధపడినట్లుంది. అధికారంలో ఉండి మనమేం చేయలేమన్న భావనకు పవన్ కల్యాణ్ వచ్చినట్లు కనపడుతుంది. ఆయన డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, పర్యావరణం, అడవులు, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల బాధ్యతలను పవన్ కల్యాణ్ చేపట్టారు. ఆయన ఆ శాఖలను అధ్యయనం చేస్తున్నారు. లోతుగా అన్ని విషయాలను పరిశీలిస్తున్నారు. అంత వరకూ ఓకే. ఆయన శాఖకు సంబంధించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుని ప్రజల నుంచి ప్రశంసలు కూడా పొందారు. ప్రధానంగా పంచాయతీలకు నిధులు కేటాయించి ఆయన సర్పంచ్ ల నుంచి మంచి మార్కులు కొట్టేశారు. ంశ్రీకానీ పవన్ కల్యాణ్ ను నమ్మి యువత,

కాపు సామాజికవర్గంతో పాటు ఆయన అభిమానులందరూ కూటమికి ఓటు వేశారు. ముఖ్యంగా మహిళలు కూడా పవన్ కల్యాణ్ వైపు మొన్నటి ఎన్నికల్లో మొగ్గు చూపారు. అయితే వీళ్లందరికీ ఇచ్చిన హామీల అమలుకు మాత్రం పవన్ కల్యాణ్ ఏమాత్రం దృష్టిపెట్టడం లేదు. కనీసం ప్రశ్నించడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రిని ప్రశ్నించలేక పోవచ్చు. కనీసం పవన్ కల్యాణ్ జోక్యం చేసుకుని ఇచ్చిన హామీల అమలు ఏ తేదీ నుంచి చేస్తారో అని చెప్పగలిగితే పవన్ కల్యాణ్ పై నమ్మకం ఉంటుంది. ఇంకా గౌరవం పెరుగుతుంది. కానీ పవన్ కల్యాణ్ అది వదిలేసి ఇప్పటికీ టీడీపీ నిర్ణయాలను ప్రశంసిస్తూ, ఓటమి పాలయిన వైసీపీని విమర్శిస్తుంటే ఆయన కూడా రాజకీయ నాయకుడు కాక.. నయా లీడర్ ఎలా అవుతాడని సోషల్ మీడియాలో పోస్టింగ్ లు కనపడుతున్నాయి. మరి దీనికి పవన్ ఒక్కరే సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

### అమెరికాలో భారత నూతన రాయబారిగా వినయ్ మోహన్ క్వాత్రా

న్యూఢిల్లీ,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): అమెరికాలో భారత నూతన రాయబారిగా వినయ్ మోహన్ క్వాత్రా మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఆయన భారత విదేశాంగ శాఖ కార్యదర్శిగా ఉన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో పదవీవిరమణ చేసిన తరణ్‌జీత్ సింగ్ సంధు స్థానంలో వినయ్ మోహన్ బాధ్యతలు చేపట్టనున్నారు. తరణ్‌జీత్ సింగ్ సంధు అమెరికా రాయబారిగా 2020 నుండి 2024 వరకు ఉన్నారు. అమెరికాలో భారత నూతన రాయబారిగావినయ్ మోహన్ క్వాత్రాకు స్వాగతం పలకడం ఆనందగా ఉందని చార్జ్ డి అఫైర్స్ శ్రీప్రియ రంగనాథన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో పనిచేయడానికి మేమంతా ఉత్సాహంగా ఉన్నామని అన్నారు. వినయ్ మోహన్ క్వాత్రా తన అధికారిక పత్రాలను అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు సమర్పించనున్నారు. 1988 బ్యాచ్‌కి చెందిన ఇండియన్ ఫారెన్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్) అధికారి క్వాత్రా ఫ్రాన్స్, నేపాల్‌లోనూ భారత రాయబారిగా ఉన్నారు. ఆ తర్వాత విదేశాంగ కార్యదర్శిగా నియమితులయ్యారు.

# వైసీపికి కాపు నేతలు బై..బై...



కాకినాడ, ఆగస్టు 13, సీపీ పై కాపుల్లో వ్యతిరేకతను గమనించి నేతలు ముందుగానే తప్పుకుంటున్నారు. ఇప్పటికే పార్టీని వీడిన నేతలందరూ దాదాపుగా అందరూ కాపులే కావడంతో పార్టీలో ఈ రకమైన చర్చ జరుగుతుంది. తమ రాజకీయ భవిష్యత్ కోసం మాత్రమే కాకుండా సొంత సామాజికవర్గంలో పట్టును, పరువును నిలుపుకునేందుకు కాపు సామాజికవర్గం లీడర్లు జగన్ కు చేయి ఇస్తున్నారు. రానున్న కాలంలో కాపు సామాజికవర్గం వైసీపీ వైపు ఉండే అవకాశం లేదని భావించి అందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటున్నారు. ప్రధానంగా ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కోస్తాంధ్రలో ఉన్న వైసీపీ కాపు సమాజికవర్గం నేతలు జగన్ పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు కాపు సామాజికవర్గం నేత. అయితే ఆయన వైఎస్ రాజశేఖర్ రెడ్డికి వీరాభిమాని. అయితే ఆయన రాజకీయ ప్రయాణం బీజేపీతో ప్రారంభమయింది. అయినా పెండెం దొరబాబు 2004 ఎన్నికల్లో బీజీపీ నుంచి పోటీ చేశారు. గెలుపొందారు. వై?ఎస్ పైఅభిమానంతో కాంగ్రెస్ లో చేరారు. వైఎస్ మరణం తర్వాత ఆయన వైసీపీలో చేరారు. దీంతో పెండెం దొరబాబుకు వైఎస్ జగన్ 2019 ఎన్నికల్లో పిఠాపురం టిక్కెట్ ను ఇచ్చారు. దీంతో వైసీపీ నుంచి ఆయన విజయం సాధించారు. 2024 ఎన్నికల్లో మాత్రం ఆయనకు టిక్కెట్ వైసీపీ నుంచి లభించలేదు. దీంతో ఆయన వైసీపీ అభ్యర్థి వంగా గీతకు అసంతృప్తితోనే సపోర్టు చేశారు. వైసీపీ ఓటమి తర్వాత ఆయన జనసేనలోకి చేరేందుకు సిద్ధమవుతున్నారు ఇక పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఆళ్ల నాని కూడా కాపు నేతే. ఆయన వైఎస్ జగన్ కు నమ్మిన బంటు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పుడు మంత్రి పదవిని చేట్టారు. ఆయన ఏలూరు నుంచి ఓటమి పాలయినా వైసీపీ తరుపు ఎమ్మెల్సీగా జగన్ చేశారు. అయితే ఆయన ఏపార్టీలో చేరకుండా రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. గుంటూరు జిల్లాకు చెంది. కిలారి రోశయ్య కూడా పార్టని వదిలి పెట్టారు. ఆయన కూడా కాపు సామాజికవర్గం నేతే. ఆయన 2019 ఎన్నికల్లో పొన్నూరు నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా గెలిచారు. 2024 ఎన్నికల్లో గుంటూరు పార్లమెంటుకు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కిలారు రోశయ్య వైసీపీలో ఉన్న అన్ని పదవులకు రాజీనామా చేశారు. ఆయన కూడా త్వరలోనే జనసేనలో చేరుతున్నారన్న ప్రచారం జరుగుతుంది. కాపు సామాజికవర్గం నేతలే కావడంతో మిగిలిన కాపులు కూడా వైసీపీ నుంచి వెళ్లిపోతారన్న ప్రచారం జరుగుతుంది. పవన్ కల్యాణ్ కాపులకు బ్రాండ్ అంబాసిడర్ గా మారడంతో ఇక వైసీపీలో ఉండి చేసేదేమీ లేదని నేతలు డిసైడ్ అయినట్లున్నారు. జనసేనలో ఉండి తమకు ఫ్యూచర్ ఉంటుందని వారు నమ్ముతున్నారు. ముద్రగడ పద్మనాభం వంటి వారి మాట కూడా చెల్లుబాటు కాకపోవడం, ఇక పవన్ కల్యాణ్ కాపులకు నేతగా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో వీరు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. వీరి బాటలోనే మరికొందరు కాపు సామాజికవర్గం నేతలు కూడా వైసీపీని వీడి జనసేనలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి వీరందరినీ జనసేన నేత పవన్ కల్యాణ్ పార్టీలో చేర్చుకుంటారా? లేదా? అన్నది మాత్రం తేలలేదు.

# ఇంకా దొరకని... 131 మంది...

తిరువనంతపురం, ఆగస్టు 13, రళ రాష్ట్రం వయనాడ్ జిల్లాలో జులై 30న కొండ చరియలు విరిగిపడి వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన యావత్ దేశాన్ని కలచి వేసింది. ఈ విపత్తులో దాదాపు నాలుగు గ్రామాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. ఘటన సంభవించి రెండు వారాలు కావొస్తున్నా ఆ విలయం ఇంకా కళ్లముందు కదలాడుతూనే ఉంది. ఈ విపత్తులో వందలాది మంది గల్లంతయ్యారు. ఇంకా చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆప్తులను కోల్పోయిన బాధితులు ఎంతోమంది ఉన్నారు. ఈ విషాదాన్ని గుర్తుచేసుకుంటేనే ఇంకొంతమంది కళ్లలో నీళ్ల తిరుగుతున్నాయి. ఈ ఘటన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా స్పందించి సహాయ చర్యలు చేపట్టాయి. అయితే తాజాగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కీలక ప్రకటన చేశారు. వాయనాడ్‌లో వినాశకరమైన ఘటన తర్వాత ఇప్పుడు చలియార్ నది, దాని ఒడ్డు, చుట్టుపక్కల అటవీ ప్రాంతాలలో భారీ సెర్చింగ్ ఆపరేషన్ ప్రారంభించనున్నారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, పోలీసు, అగ్నిమాపక దళం, అటవీ శాఖ అధికారులతో సహా 190 మంది సభ్యుల బృందం ఈ ఆపరేషన్‌లో పాల్గొంటున్నట్లు ఎడిజిపి ఎంఆర్ అజిత్ కుమార్ తెలిపారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు 200లకు పైగా మృతదేహాలను గుర్తించగా.. 130 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు పేర్కొన్నారు. రెండు వారాలుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతూనే ఉంది. ఇప్పటికీ దొరకని వారి జాడ కోసం చలియార్ నది, పరిసర అటవీ ప్రాంతాల్లో ముమ్మర గాలింపు చేపట్టినట్లు వెల్లడించారు. ఎగువ ప్రాంతం మొత్తం పూర్తి అయిందని, ప్రస్తుతం దిగువన తమ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు. ప్రస్తుం నీటిమట్టం తగ్గడంతో మృతదేహాలు బయటకు వస్తున్నాయని చెప్పారు. సోమవారం చేపట్టిన గాలింపులో పలు శరీర భాగాలు లభ్యమైనట్లు స్థానిక మీడియా వెల్లడించింది. 30న సంభవించిన కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఇప్పటివరకు 400 మంది మరణించినట్లు రాష్ట్ర అధికారులు తెలిపారు. 200మంది మృతదేహాలను గుర్తించారు. స్వాధీనం చేసుకున్న మృతదేహాలలో 51 మందిని గుర్తించలేదు. ఇంకా 130 మందికి పైగా గల్లంతయ్యారు. గత సోమవారం సెర్చ్ ఆపరేషన్‌లో కొన్ని మృతదేహాల భాగాలను అధికారులు కనుగొన్నారు. విపత్తు ప్రభావిత ప్రాంతంలో ఉదయం ప్రారంభమైన సెర్చ్ ఆపరేషన్ ఐదు ప్రాంతాలుగా విభజించబడింది. అయితే ముండక్కై, చురల్‌మల ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో కొంతసేపు నిలిచిపోయింది. అన్ని ప్రాంతాలను మళ్లీ ఇంచు ఇంచు స్కాన్ చేసే వరకు సెర్చింగ్ కొనసాగుతుంది. వాయనాడ్ జిల్లాలోని ముండక్కై, చురల్‌మల ప్రాంతాలను కొండచరియలు దాదాపు పూర్తిగా నాశనం చేశాయి. సవాళ్లతో కూడిన భూభాగంలో బృందాలు అవిశ్రాంతంగా పని చేస్తున్నాయి.

బాధిత కుటుంబాలకు వారి ఆప్తుల కడసారి చూపునైనా దక్కించేందుకు రెస్క్యూ బృందాల కృషి చేస్తున్నాయి.

# నిద్ర మత్తులో బెజవాడ పోలీసులు

విజయవాడ, ఆగస్టు 13 బెజవాడలో పోలీసుల నిఘా నిద్రపోతోంది. స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ వైఫల్యాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. శివారు ప్రాంతాల్లో యథేచ్ఛగా వలసలు, అక్రమ నిర్మాణాలు సాగుతున్నా మొద్దు నిద్ర నటిస్తున్నారు. గత కొన్నేళ్లుగా సాగుతున్న దందా క్రమంగా అంతర్గత భద్రతకు ముప్పుగా పరిణమిస్తోంది. ఉపాధి కోసం పొరుగుజిల్లాలు, రాష్ట్రాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు జరగడం సాధారణమే అయినా విజయవాడలో మాత్రం అసహజమైన స్థాయిలో వలసలు కొన్నేళ్లుగా పెరిగాయి. వీటిని నియంత్రించడం, వలసదారులపై నిఘా పెట్టడంలో పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అక్రమ వలసదారులకు షెల్టర్‌జోన్లుగా విజయవాడ పాతబస్తీ పరిసర ప్రాంతాలతో పాటు ఆటోనగర్, సనత్‌నగర్, కృష్ణలంక ప్రాంతాలు ఉన్నాయి. విజయవాడ పాతబస్తీలో?న వించిపేట, రాజరాజేశ్వరిపేట, పంజాసెంటర్, మహంతిపురం, ఆటోనగర్, కృష్ణలంక, రాణిగారి తోట ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వలసదారులు మకాం వేశారు. యూపీ, బీహార్, బెంగాల్, ఝార్ఖండ్ రా?ష్ట్రాల నుంచి వేల సంఖ్యలో వలస దారులు విజయవాడలో స్థిరపడ్డారు. స్థానికేతరులపై నిఘా ఉండని ప్రాంతాలనే లక్ష్యంగా చేసుకుని వలసలు పెరిగాయి. విజయవాడ పశ్చిమ నియోజక వర్గంలో గత పదేళ్లలో మొత్తం ఓటర్లలో రెండు శాతం స్థానికేతరులు జత చేరారు. ఓ పద్ధతి ప్రకారం వలసల్ని స్థానిక నాయకులు ప్రోత్సహించారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తోపుడు బళ్లపై వ్యాపారాలు, కాన్పూర్ దుప్పట్లు, చెప్పులు, పానీపూరీ బళ్లు, పింగణి వస్తువులు, నిర్మాణ కూలీలు, బ్యాగుల తయారీదారులు, పిఓపి సీలింగ్ వర్కర్లుగా గత కొన్నేళ్లుగా ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి భారీగా వలసలు పెరిగాయి. స్థానికుల కంటే ఎక్కువ అద్దె చెల్లించడానికి సిద్ధపడటంతో వారికి ఎలాంటి ధృవీకరణలు లేకుండా ఇళ్లు అద్దెకు ఇవ్వడం గత పదేళ్లలో బాగా పెరిగింది. ఉపాధి కోసం వచ్చిన వారిలో చాలామంది క్రమంగా ఇక్కడే ఇళ్లను కొనుగోలు చేసి స్థిరపడటం పెరిగిపోయింది. విజయవాడ పాతబస్తీ ప్రాంతంలో ఈ తరహా విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇక ఇళ్లను కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్న వారికి అక్రమ నిర్మాణాలకు స్థానిక నాయకులు సహకరిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, రైల్వే స్థలాల్లో అక్రమ నిర్మాణాలను ద్వితీయ శ్రేణి నాయకత్వం సహకరిస్తోంది. గత ఐదేళ్లలో ఇలా వేలాదిమందితో అక్రమ నిర్మాణాలను ఓ పార్టీ నాయకులు ప్రోత్సహించారు. స్థానిక రాజకీయ నాయకుల ప్రమేయంతోనే

## శివారు ప్రాంతాల్లో యథేచ్ఛగా వలసలు, అక్రమ నిర్మాణాలు

ఇలా వలసలు బాగా పెరిగాయి. యూపీ, బీహార్ వంటి రాష్ట్రాల్లో ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో విజయవాడ వంటి నగరాలపై ఈ వలసలు పెరిగాయి. స్థానికంగా ఉన్న ప్రశాంత వాతావరణం వారికి అనువుగా చేసుకుంటున్నారు. పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లో నెలకొన్న అస్థిర వాతావరణం నేపథ్యంలో సురక్షిత ప్రాంతాల్లో స్థిరపడేందుకు అక్రమ వలసలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. బ్యాగుల తయారీ, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ పనులు, పానీపూరీ బళ్లు, ఐస్ క్రీమ్‌ల తయారీ, చిన్నా చితక వ్యాపారాలతో నగరంలో తిష్ట వేస్తున్నారు. ఇలా వచ్చే వారిలో బెంగాల్ మీదుగా బంగ్లాదేశ్ నుంచి వచ్చే వారు కూడా పెద్ద సంఖ్యలోనే ఉంటున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కొందరు నేతలు ఈ తరహా వలసల్ని ప్రోత్సహించారు. తమ వర్గం ఓట్లను పెంచుకోడానికి ఇలాంటి అక్రమాలకు అండగా నిలిచారు. గత ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికయ్యేందుకు కొందరు నేతలు ఇలాంటి అనైతిక పద్ధతులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయిఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిపై కనీస నిఘా లేకుండానే ఇళ్లను అద్దెకివ్వడంతోనే ఈ సమస్య మొదలవుతోంది. స్థానికంగా ఉండే గల్లీ స్థాయి నాయకులకు ఎంతో కొంత ముట్ట చెబితే బెజవాడలో అద్దె ఇళ్లు లభించడం పెద్ద సమస్య కాదని, ఇక్కడ చేరిన వారు అయా ప్రాంతాలకు సమాచారం ఇస్తున్నారు. ఇలా వచ్చే వారికి కనీస వివరాలు సేకరించకుండానే యజమానులు ఇళ్లను అద్దెకిస్తున్నారు. ఇలా వచ్చిన వారికి అనతి కాలంలోనే స్థానికంగా ఓటరు కార్డులు, వాటి ఆధారంగా గుర్తింపు కార్డులు, ఆధార్ కార్డుల్ని పొందుతున్నారు. గత ఐదేళ్లలో ఇలాంటి అక్రమాలకు వాలంటీర్లు పూర్తి సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. వలస వచ్చిన వారిని ఓటర్ల జాబితాల్లో చేర్పించడంలో వారు కీలక పాత్ర పోషించారు. అక్రమ వలసదారులపై కార్డన్ సెర్చ్‌లు, వారిని గుర్తించే యంత్రాంగం లేనేలేదు. స్థానికులు ఎవరు, స్థానికేతరులు ఎవరనే దానిపై ఎలాంటి గణాంకాలు ప్రభుత్వ యంత్రాంగం వద్ద లేవు. దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చే వారితో పాటు బంగ్లాదేశ్ నుంచి సరిహద్దులు దాటి వచ్చే వారు కూడా వలసదారుల్లో ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానికేతరుల ప్రాబల్యంపై ప్రజల్లో నెలకొన్న భయాందోళనలే గత ఎన్నికల ఫలితాలకు కారణం అయ్యాయనే వాదనలు కూడా ఉన్నాయి.

# డ్రగ్స్ పెడ్లర్ మస్తాన్ సాయి అరెస్ట్

## లావణ్య, రాజ్ తరణ్ వ్యవహారంతోనూ లింకులు !,

గుంటూరు ఆగస్టు 13, లావణ్య, రాజ్ తరుణ్ వ్యవహారంలో ఎక్కువగా వినిపించిన పేరు మస్తాన్ సాయి. లావణ్యకు మస్తాన్ సాయినే డ్రగ్స్ సరఫరా చేసేవాడని..ఆయనతోనే చాలా కాలం సహజీవనం చేసిందని రాజ్ తరుణ్ ఆరోపించారు. అయితే అప్పట్నుంచి ఈ మస్తాన్ సాయి అనే వ్యక్తి కనిపించకుండా పోయారు. పలు డ్రగ్స్ కేసుల్లో ఈ మస్తాన్ సాయి ఉన్నట్లుగా గుర్తించిన హైదరాబాద్ పోలీసులు పట్టుకునేందుకు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. గుంటూరులోని ఓ దర్గాలో తలదాచుకున్నట్లుగా గుర్తించి..అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ కు తరలించి విచారణ జరుపుతున్నారు. ఈ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మస్తాన్ సాయి అనే వ్యక్తి డ్రగ్స్ బిజినెస్‌ను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారని గుర్తించారు. హైదారాబాద్ లోని వరలక్ష్మి టిఫిన్స్ ,ఇటీవల డిల్లి నుంచి డ్రగ్స్ తెస్తున్న నిందితుడిగా ఉన్న మస్తాన్ సాయిని గుర్తించారు. పోలీసులు మస్తాన్ సాయి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని అందులో వివరాలను పరిశీలిస్తే.. మైండ్ బ్లాంకయ్యే నిజాలు వెలుగులోకి వచ్చాయి. మస్తాన్ సాయి ఫోన్ లో చాలా మంది అమ్మాయి ల ప్రైవేటు వీడియోలు ఉన్నట్లు గుర్తించారు. పలువురు అమ్మాయిలు ప్రయివేటు వీడియోలు చిత్రకరించి బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లు గుర్తించారు. మస్తాన్ సాయి మొబైల్ లో వీడియోలపై ఆరా తీస్తున్న పోలీసులు .. వారిని ఎలా ట్రాప్ చేశారో తెలుసుకుంటున్నారు. ఏపీ , తెలంగాణా కి చెందిన అమ్మాయిలను టార్గెట్ గా చేసుకొని మస్తాన్ సాయి మోసం చేస్తున్నట్లు గుర్తించారు. సినిమా అవకాశాలు .. ఇతర ప్రలోభాలకు గురి చేసి మస్తాన్ సాయి యువతుల్ని వంచిస్తున్నట్లుగా భావిస్తున్నారు. ఈ క్రమంలో లావణ్య కూడా మస్తాన్ సాయి ట్రాప్ లో పడినట్లుగా తెలుస్తోంది. మస్తాన్ సాయితో కలిసి డ్రగ్స్ తీసుకోవడం ప్రారంభించిన తర్వాతనే లావణ్య దూరమైందని.. డ్రగ్స్ తీసుకోవద్దని ఎన్ని సార్లు చెప్పినా వినలేదని రాజ్ తరుణ్ మీడియా సమావేశంలో చెప్పారు. లావణ్య కూడా మస్తాన్ సాయితో

పరిచయం ఉందని చెప్పింది కానీ.. అంతకు మించి పెద్దగా వివరాలు జోలికి వెళ్లలేదు. డ్రగ్స్ వ్యాపారంపై పంజా విసురుతున్న హైదరాబాద్ పోలీసులు.. మస్తాన్ సాయిని అరెస్టు చేస్తే ప్రధానంగా గుట్టు రట్టవుతుందని క్లారిటీ రావడంతో నిఘా పెట్టారు. తన కోసం పోలీసులు వెదుకుతున్నారని తెలిసిన తర్వాత మస్తాన్ సాయి.. అజ్ఞాతంలోకి వెళ్లారు. అయితే డ్రగ్స్ బిజినెస్ మాత్రం మానలేదు. డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తూ.. గుంటూరు రైల్వే స్టేషన్ లో దొరికినట్లు దొరికి తప్పించుకున్నాడు. కానీ తర్వాత పోలీసుల నిఘాకు దొరికిపోయాడు. విచారణలో సంచలన విషాయులు వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అగ్రిగోల్డ్ భూముల కొనుగోలు వ్యవహారం

## జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్ తదితరుల అరెస్ట్
## అగ్రిగోల్డ్ యాజమాన్యం ఫిర్యాదుతో కదిలిన ఎసిబి

అమరావతి,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): అగ్రిగోల్డ్ భూముల కొనుగోలు వ్యవహారం కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్‌ను ఏసీబీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ కేసులో ఆయన నిందితుడిగా ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు. కాగా ఈ కేసులో కొందరు నిందితులు ఉన్నారు. 1. జోగి రాజీవ్, 2. జోగి సోదరుడు వెంకటేశ్వరరావు, 3. అడుసుమిల్లి మోహన రంగ దాసు, 4. వెంకట సీతామహాలక్ష్మి, 5. సర్వేయర్ దేదీప్య 6. మండల సర్వేయర్ రమేశ్, 7. డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్, 8. విజయవాడ రూరల్ ఎమ్మార్వో జాహ్నవి, 9. విజయవాడ రిజిస్ట్రార్ నాగేశ్వరరావులు ఈ జాబితాలో ఉన్నారని అధికారులు తెలిపారు. కాగా మిగతా వారిని పోలీసులు త్వరలో విచారించే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ బండారం బహిర్గతమవుతోంది. ఏసీబీ మరిన్ని వివరాలు సేకరిస్తుండడంతో జోగి కుమారుడు మెడకు ఉచ్చు బిగిస్తోంది. కాగా విజయవాడ రూరల్ మండలంలోని అంబాపురంలో అగ్రిగోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో జోగి కుటుంబం అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆయన అక్రమాలపై ఏడాది క్రితం అగ్రిగోల్డ్ యాజమాన్యం ఫిర్యాదు చేసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేసులో కదలిక వచ్చింది. అంబాపురంలో సర్వే నెం. 88లోని 2160 గజాల అగ్రిగోల్డ్ స్థలాన్ని సీఐడీ గతంలోనే అటాచ్ చేసింది. వేరేవారి పేరుపై నకిలీ రిజిస్ట్రేషన్ చేసి మళ్లీ తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు జోగి రమేష్ కుట్ర చేసినట్లు రెవెన్యూ నివేదికలో తేటతెల్లమైంది. వేరే వారి దగ్గర నుంచి ఈ స్థలాన్ని జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్, జోగి సోదరుడు వెంకటేశ్వరరావు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మళ్లీ ఈ స్థలాన్ని విజయవాడకు చెందిన వేరే వారికి అమ్మేశారు. ఈ విషయంలో తమ పేరు బయటకు రాకుండా జాగ్రత్తపడ్డారు. ఈ మొత్తం వ్యవహారంలో అప్పటి మంత్రి జోగి రమేష్ ఉన్నారని అధికారులు చెబుతున్నారు. మొత్తం రూ. 7 కోట్లు విలువైన స్థలం కబ్జా అయినట్లు అధికారులు లెక్క తేల్చారు. కాగా సీఐడీ తనఖాలో ఉన్న స్థలాన్ని ఎలా రిజిస్ట్రేషన్ చేశారనే అంశంపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా మాజీ మంత్రి జోగి రమేష్ ఈరోజు (మంగళవారం) సాయంత్రం మంగళగిరి డీఎస్పీ ఆఫీసులో విచారణకు హాజరుకానున్నారు. చంద్రబాబు నివాసంపై దాడి కేసులో విచారణకు రావాలని పోలీసుల నోటీసులు ఇచ్చారు. కాగా మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత జోగి రమేష్ ఇంట్లో ఏసీబీ సోదాలు చేస్తోంది. ఇబ్రహీంపట్నంలోని రమేష్ నివాసంలో మంగళవారం తెల్లవారుజామున 15 మంది అధికారుల బృందం రంగంలోకి దిగి సోదాలు చేపట్టింది. రమేష్ ఇంట్లో ఉన్న కీలక డాంక్యుమెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అగ్రిగోల్డ్ భూముల విషయంలో జోగి రమేష్‌పై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. చాలామంది బాధితులు ఆయనపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. మంత్రిగా ఉన్న సమయంలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు అధికారుల దృష్టికి రావడంతో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నట్లు సమాచారం.

# అగ్రిగోల్డ్ భూములపై బహిరంగ చర్చకు సిద్ధం

## కావాలనే మావాడిని కేసులో ఇరికించి అరెస్ట్ చేశారు
## రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్న మాజీ మంత్రి జోగి

విజయవాడ,ఆగస్ట్13: ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ మంత్రి జోగి రమేష్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 'మా అబ్బాయి ఎటువంటి తప్పు చేయలేదు. అగ్రిగోల్డ్ భూముల విషయంపై బహిరంగ చర్చకు సిద్ధం. మా కుటుంబం ప్రమేయం ఉన్నట్లు నిరూపిస్తే ఎటువంటి చర్యలకు అయినా సిద్ధం. మా వాడు విదేశాల్లో చదువుకుని ఇక్కడకు వచ్చాడు. చంద్రబాబు రాజకీయాలకు మా వాడిని బలి చేస్తున్నారు. మీకు, మీ ఇంట్లో పిల్లలు ఉన్నారనేది గుర్తు ఉంచుకోండని అన్నారు. ఇక్కడితో అయిపోదు.. మాకు కూడా సమయం వస్తుందని ఆయన అన్నారు. చంద్రబాబు అక్రమ కేసులతో వేధిస్తే భయపడమని స్పష్టం చేశారు. ఆనాడు కూడా జగన్మోహన్ రెడ్డిని టీడీపీ వాళ్లు బూతులు తిట్టారని.. ఆ అంశాలను చంద్రబాబుకు వివరించడానికే వాళ్ల ఇంటికి వెళ్లానని తెలిపారు. దానిని దాడిగా చిత్రీకరించి అడ్డుకున్నారన్నారు. తప్పకుండా న్యాయం గెలుస్తుందన్నారు. మావాడి పాత్ర లేదని రుజువు అవుతుంది అని జోగి రమేష్ స్పష్టం చేశారు. కాగా... అగ్రిగోల్డ్ భూముల కొనుగోలు వ్యవహారం కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్‌ను ఏసీబీఅధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ కేసులో ఆయన నిందితుడిగా ఉండడంతో అదుపులోకి తీసుకున్నారు

# విజయవాడలో పంద్రాగస్ట్ వేడుకలు

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల రిహార్సల్స్
## ఫుల్ డ్రెస్ సన్నద్ధతను పరిశీలించిన అధికారులు

విజయవాడ,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 15న రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరగనున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల సమక్షంలో మంగళవారం నిర్వహించిన ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ విజయవంతమయ్యాయి. రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) ఎస్.సురేష్ కుమార్.. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన, ఏపీఎస్‌పీ డీఐజీ బి.రాజకుమారి, ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర, విజయవాడ ఆర్‌డీవో బీహెచ్ భవానీ శంకర్ తదితరులతో కలిసి రిహార్సల్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. త్రివర్ణ శోభిత వేడుకలకు సంబంధించి అడిషనల్ డీజీపీ (ఎఫ్ఏసీ), ఏపీఎస్‌పీ బెటాలియన్స్, ఐజీపీ (శాంతిభద్రతలు) సీహెచ్ శ్రీకాంత్ నోడల్ అధికారిగా, ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర బాబు పోలీస్ సమన్వయ అధికారిగా, ప్రోటోకాల్ డైరెక్టర్ ఎం.బాలసుబ్రమణ్యం రాష్ట్ర సమన్వయ అధికారిగా వ్యవహరిస్తారు. ఏఎస్ఆర్ జిల్లా అడిషనల్ ఎస్‌పీ కె.ధీరజ్ పరేడ్ కమాండర్‌గా, ఏపీఎస్‌పీ 14వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పీవీ హనుమంతు పరేడ్ సెకండ్-ఇన్-కమాండ్‌గా, పరేడ్ అడ్జుటెంట్‌గా ఏపీఎస్‌పీ 3వ బెటాలియన్ ఆర్ఐ టి.ప్రభాకర్‌రావు వ్యవహరించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కవాతులో తెలంగాణ స్టేట్ పోలీస్, ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్ (కర్నూలు), ఏపీఎస్‌పీ మూడో బెటాలియన్ (కాకినాడ), ఏపీఎస్‌పీ 11వ బెటాలియన్ (కడప), ఏపీఎస్‌పీ 16వ బెటాలియన్ (విశాఖపట్నం), ఎన్‌సీసీ బాలురు, ఎన్‌సీసీ బాలికలు, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏపీ రెడ్‌క్రాస్ సొసైటీ, ఏపీ సైనికల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ బృందాలు పాల్గొననున్నాయి. బ్రాస్‌బ్యాండ్స్ విభాగంలో కర్నూలు, కాకినాడ, విజయనగరం, మంగళగిరి, వెంకటగిరి, కడప, అనంతపురం, విశాఖపట్నం ఏపీఎస్‌పీ బెటాలియన్లతో పాటు మంగళగిరి ఏపీఎస్‌పీ బెటాలియన్స్ పైప్‌బ్యాండ్, ఎస్ఏఆర్ సీపీఎల్ హైదరాబాద్ యూనిట్ బ్రాస్, పైప్ బ్యాండ్స్ బృందాలు పాల్గొననున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గౌరవ రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు తదితరులు హాజరుకానున్నారు.

# మండలికి కీలక పదవి...

విజయవాడ, ఆగస్టు 13, మండలి బుద్ధ ప్రసాద్ అంటే పరిచయం అక్కరలేని పేరు. కులాలు, మతాలకు అతీతంగా ఆయనను అందరూ అభిమానిస్తారు. మండలి బుద్ధ ప్రసాద్ కుటుంబం అంటే అదొక గౌరవం. అదొకరకమైన ఆప్యాయత. వివాదాల జోలికి పోరు. అవినీతి మచ్చ తనకు అంటనివ్వరు. మృదుస్వభావి. ఇలా చెప్పుకుంటూ పోతే మండలి బుద్ధ ప్రసాద్ ఎన్నో క్వాలిఫికేషన్లు ఉన్నాయి. ఆయనను వేలెత్తి ప్రత్యర్థులు కూడా ఎత్తి చూపలేరు. రాజకీయ కక్ష సాధింపు చర్యలు ఆయనకు చేతకావు. కొన్ని దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న మండలి బుద్ధ ప్రసాద్ ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యేగానే కొనసాగుతుండటంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. మండలి బుద్ధ ప్రసాద్ తండ్రి మండలి వెంకట కృష్ణారావు 1972లో అవనిగడ్డ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1978 ఎన్నికల్లోనూ ఆయన గెలిచారు. 1983 ఎన్నికల్లోనూ గెలిచి హ్యాట్రిక్ విజయం సాధించారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మంత్రిగా పనిచేశారు. తెలుగు భాషకోసం ఆయన పరతపించేవారు. అలాంటి నేత కు జన్మించిన మండలి బుద్ధప్రసాద్ కూడా తెలుగు భాష కోసం నిరంతరం శ్రమిస్తారు. ఎక్కడ తెలుగు మహాసభలు జరిగినా అక్కడ హాజరై తన కున్న అభిప్రాయాలను చెబుతారు. తెలుగు భాషపై మమకారాన్ని తండ్రి నుంచి అందిపుచ్చుకున్న ఆయన రాజకీయ వారసత్వాన్ని కూడా అదే స్థాయిలో అందుకున్నారు. ఇంకా అభ్యర్థిని ప్రకటించని టీడీపీ వైఎస్సార్ మంత్రివర్గంలో... 1999లో మండలి బుద్ధ ప్రసాద్ అవనిగడ్డ నుంచి శాసనసభ్యుడిగా గెలిచారు. కాంగ్రెస్ లో ఉండి 2004 ఎన్నికల్లోనూ ఆయన విజయం సాధించారు. 2004 లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రి వర్గంలో ఆయన పనిచేశారు. పశుసంవర్థక, పాడి పరిశ్రమ శాఖ బాధ్యతలను చేపట్టారు. తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో ఆయనకు గెలుపు లభించలేదు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఆయన కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరారు. 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2015 లో ఆయన శాసనసభ డిప్యూటీ స్పీకర్ పదవిని పొందారు. సీనియర్ నేతగా ఆయన మెతక వైఖరి ఆయనకు పదవులను తెచ్చి పెట్టలేకపోయిందనే వారు అనేక మంది ఉన్నారు. 2024లో టీడీపీ నుంచి జనసేనలో చేరిన మండలి బుద్ధ ప్రసాద్ తిరిగి అవనిగడ్డ నుంచి గెలిచారు. కానీ ఈసారి ఆయనకు మంత్రి వర్గంలో స్థానం లభించలేదు. సీనియర్ నేతగా ఉన్న మండలి బుద్ధ ప్రసాద్ ఎన్నికలకు ముందు జనసేనలో చేరి గెలవడమే మంత్రి పదవి దక్కకపోవడానికి కారణంగా చెబుతున్నారు. అయితే ఆయన మనస్తత్వం తెలిసిన పార్టీ అగ్రనాయకత్వం ఆయనకు ఏదో ఒక పదవి ఇవ్వాలని డిసైడ్ అయిందని తెలిసింది. మరోసారి ఆయనను డిప్యూటీ స్పీకర్ లేదా? మరో ముఖ్యమైన పదవిని కట్టబెట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. కేబినెట్ ర్యాంక్ పదవి వస్తుందని చెబుతున్నారు. అదే జరిగితే మండలి బుద్ధ ప్రసాద్ అభిమానులకు ఆనందానికి కొదవ ఉండదు. మరి ఏం జరుగుతుందనేది చూడాలి.

# దువ్వాడ ఫ్యామిలీలో రచ్చకు ఫుల్ స్టాప్ పడుతుందా?

శ్రీకాకుళం, ఆగస్టు 13, (న్యూస్ పల్స్)వారం రోజులుగా నడుస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ ఫ్యామిలీలో రచ్చకు ఫుల్ స్టాప్ పడుతుందా? అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. ఫైనల్‌గా ఎమ్మెల్సీ దువ్వాడ కుటుంబ సభ్యుల చర్చలు ముగిసాయి. రెండు గంటల పాటు చర్చించిన దువ్వాడ బంధువులు.. 5 డిమాండ్లను దువ్వాడ సోదరుడితో చెప్పారు వాణి బంధువులు. ఆస్తుల పంపకం, విడాకులపై సుదీర్ఘంగా చర్చించారు ఇరువర్గాలు. పిల్లలను దృష్టిలో పెట్టుకొని విడాకులు వద్దని నచ్చచెప్పారు వాణి కుటుంబసభ్యులు. తాము జరిపిన చర్చలు సఫలం అవుతాయని.. ఈరోజుతో ఈవివాదానికి ఫుల్ స్టాప్ పడుతుందని వాణి బంధువులు భావిస్తున్నారు. చర్చలు విషయం పక్కన పెడితే.. ఇంత జరిగాక తన అన్న విడాకులకే సిద్ధమయ్యారని చెబుతున్నారు దువ్వాడ శ్రీనివాస్ సోదరుడు శ్రీధర్. మరోసారి అన్న దువ్వాడ శ్రీనివాస్‌తో మాట్లాడాక ఫైనల్ నిర్ణయం చెబుతామన్నారు శ్రీధర్. దువ్వాడ, వాణి విషయం ఇలా ఉంటే.. యాక్సిడెంట్ తర్వాత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాధురి మాత్రం ఎమోషనల్‌గా మాట్లాడారు. హాస్పిటల్ నుంచి వీడియో విడుదల చేశారు మాధురి.

## మర్యాదపూర్వకంగా తహశీల్దార్ మల్లికార్జున రావును కలిసిన తెలుగుదేశం పార్టీ నాయకులు.

తహశీల్దార్ ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు చిన్ని కృష్ణ యాదవ్ తదితరులు.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-రుద్రవరం మండల తహశీల్దార్ గా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జునరావును టీ లింగం దిన్నె గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం టిడిపి నాయకులు మిాసాల చిన్నికృష్ణ యాదవ్, గాలి పోతుల వెంకటేశ్వర్లు, సాంబ, తహశీల్దార్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువ వేసి పూలమాలతో సన్మానించి పూలబోకెను అందజేశారు.

## అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

ఆళ్లగడ్డ, ఆగస్టు:13, శ్రీ ప్రస్థానం న్యూస్:- మండల కేంద్రమైన దొర్నిపాడు గ్రామానికి చెందిన బలిజ బుడ్డ పెద్ద కృష్ణయ్య (50 ) అనే కౌలు రైతు అప్పుల బాధ తాళలేక సోమ వారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.గ్రామంలో



కృష్ణయ్యా తనకున్న 1.50 ఎకరం పొలం తో పాటు గత రెండు మూడేళ్లుగా 8 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిరప,జొన్న పంటలను సాగు చేస్తున్నాడు. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక సుమారు రూ.15 లక్షలు అప్పులు చేశాడు. దీంతో అప్పులు చెల్లించలేని తీవ్ర మనస్తాపం చెందిన అతను సోమవారం సాయంత్రం పొలం వద్ద పురుగు మందు త్రాగాడు.విషయం తెలుసుకున్న కుటుంబీకులు వెంటనే అక్కడకు చేరుకొని ప్రధమ చికిత్స అనంతరం అళ్ళగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూల్ కి తరలించగా కోలుకోలేక మంగ్లవారం మృతి చెందారు. మృతుడికి భార్య తో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతిని బార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ. సురేష్, తెలిపారు.

## కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా రైతులకు విరివిగా రుణాలు ఇవ్వండి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, ఆగస్టు 13:-రైతుల భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పంట రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కేంద్ర సహకార బ్యాంక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్లోబర్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా రైతులకు పంట రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. అగ్రికల్చర్ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద చేపట్టిన మల్టీపర్పస్ గోడౌన్ల సెంటర్లు, లార్జెస్ట్ గ్రైన్ స్టోరేజ్ నిర్మాణంలో ఉన్నటువంటి సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గోడౌన్లకు కావాల్సిన స్థలాలను అన్వేషించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా సహకార అధికారిని కలెక్టర్ ఆదేశించారు. సహకార సంఘాలన్నింటిని కంప్యూటీకరణ చేసి సంబంధిత ఉద్యోగులకు తగు శిక్షణ ఇవ్వాలన్నారు. సర్వర్లలో వచ్చే సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. 2025 సెప్టెంబర్ నుండి చేపట్టాల్సిన పశుగణనను జాగ్రత్తగా నిర్వహించాలని పశుసంవర్ధక శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే పథకాలను సమర్థవంతంగా ఉపయోగించుటకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు.జిల్లా సహకార అధికారి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సహకార బ్యాంకుల కంప్యూటీకరణ 20% పూర్తయిందని అక్టోబర్ 2 నాటికి 56 సంఘాలలో కంప్యూటీకరణ పూర్తి చేస్తామన్నారు. సహకార సంఘాలలో జరుగుతున్న కార్యక్రమాలు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధికారులు శివలీల, పశు సంవర్ధక శాఖ అధికారి గోవింద నాయక్, వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, డిపిఓ మంజుల వాణి, మత్స్యశాఖ డిడి రాఘవరెడ్డి, పంచాయతీరాజ్, విజయ డైరీ సంఘ సహకార అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పొలంబడి కార్యక్రమం.తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ మండలంలో శ్రీరంగాపురం గ్రామాన్ని పొలంబడి కార్యక్రమం కింద ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీస్ భాగంగా సమగ్ర యాజమాన్య పద్ధతుల పాటించి తక్కువ పెట్టుబడి తో అధిక ఆదాయాలు ఎలా పొందాలి అనే విషయాలు రైతులతో ముఖాముఖిగా చర్చించడం జరిగిందన్నారు. ఈ పొలంబడి కార్యక్రమంలో పురుగుమందుల అవశేషాలులేని పంటలను పండించి ఇండి గ్యాప్ సర్టిఫికెట్ ద్వారా అంతర్జాతీయ విఫణి లో అధిక లాభాలు ఆర్జించాలని తెలిపారు. పైన తెలిపిన కార్యక్రమాలన్ని వ్యవసాయ అధికారులు మరియు ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ ద్వారా అమలవుతుందని తెలిపారు. అలాగే

జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ. సమావేశంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి.



ఖరీఫ్ లో సాగవుతున్న ప్రతి పంటను ప్రతి రైతు, రైతు సేవ కేంద్రాల సిబ్బందిని కలిసి పంట నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్రవరం మండల తాహశీల్దార్ డి వి మల్లికార్జునరావు మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 680 కౌలు రైతు కార్డ్స్ పంపిణీ చేయడం జరిగిందని, ఇంకా ఎవరైనా కౌలు రైతు కార్డులు తీసుకోవాలనుకుంటే సంబంధిత గ్రామాలలోని వీఆర్వోలను, రైతు సేవ కేంద్రం సిబ్బందిని కలిసి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజు, రైతు సేవ కేంద్ర సిబ్బంది శ్రీకాంత్, మరియు గ్రామ పెద్దలు నారాయణరెడ్డి, నరసింహారెడ్డి,గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో సురక్షిత కాన్పులు..

మండల వైద్యాధికారి డాక్టర్ నాగేంద్ర.



దొర్ని పాడు,ఆగస్టు:13, శ్రీ ప్రస్థానం న్యూస్:- ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళలకు సురక్షితమైన కాన్పులు జరుగుతాయని దొర్ని పాడు మండల వైద్యాధికారి డాక్టర్. నాగేంద్ర,తెలిపారు. భీముని పాడు గ్రమానికి నజీన అనే మహిళ పురటి నొప్పులు ఎక్కువ కావడంతో సోమవారం రాత్రి దొర్ని పాడు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేరగా ఆమెకు వెంటనే డాక్టర్ నాగేంద్ర ,అధ్వర్యంలో వైద్య సిబ్బందిచే వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మంగ్ల వారం ఉదయం 11.00 గంటల సమయంలో ఎలాంటి ఆపరేషన్ అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ కాన్పు ద్వారానే మహిళ మగబిడ్డ కు జన్మ నిచ్చిందని పుట్టిన నవ శిశువు తో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉ న్నారన్నారు.పుట్టిన మగ బిడ్డ సుమా రు 2.5 కేజీ ల బరువు ఉన్నారని వెంటనే జీరో డోస్ టీకాను కూడా వేశామని తెలిపారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు రోగులకు అందుతాయన్నారు. మహిళలు ప్రసవాల కోసం ఎక్కువ ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి డబ్బులు వృదా చేసుకోవద్దని సూచించారు.. అంతే కాకుండా మహిళలు గర్భం దాల్చిన మొదటి నెలనుండి ప్రసవం దాల్చే వరకూ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్న గర్భిణీలకు ఆరోగ్యశ్రీ అసరా పథకం కింద రూ 5 వేల ఆర్థిక సహాయం నేరుగా వారి అకౌంట్ లోనే జమ చేయడం జరుగుతుందన్నారు.. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ శారద, ఎఫ్ ఎన్ ఓ.మానస,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## త్వరలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ

భూ సమస్యలను పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు, ఆగస్టు 13:- రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు త్వరలో రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ప్రజా ప్రతి ఐదుకు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 16 వ తేది నుండి రెవెన్యూ సదస్సుల కార్యక్రమం జరగాల్సి ఉందని, అయితే సాధారణ బదిలీలు ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని త్వరలోనే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే రెవెన్యూ సదస్సుల నిర్వహణకు షెడ్యూల్ రూపొందించడం జరిగిందని, ప్రభుత్వం నుండి రివైజ్డ్ తేదీలు రాగానే, షెడ్యూల్ లో తేదీలు మాత్రమే మార్పు చేయవలసి ఉంటుందన్నారు. సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ముఖ్యంగా భూ వివాద సమస్యల పై 70 నుండి 80 శాతం అర్జీలు ప్రజల నుండి వస్తున్నాయని, వాటి కోసం ఇంత దూరం రాకుండా ఈ సదస్సుల వల్ల వీటిని గ్రామాల్లోనే పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.. తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, వీఆర్వో, నోడల్ అధికారి, దేవదాయ శాఖ అధికారి, రిజిస్ట్రేషన్, అటవీ, సర్వేయర్, వక్ఫ్ బోర్డ్ అధికారులనీదరూ కలిసి ఒక టీం గా ఏర్పడి ఒక గ్రామానికి సంబంధించిన రికార్డ్స్ తీసుకొని సంబంధిత గ్రామానికి వెళ్లి ప్రజల నుండి అర్జీలను తీసుకుంటారని, అవసరమనుకుంటే ఫీల్డ్ లో వెరిఫై చేసి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం రెవెన్యూ సదస్సుల కార్యక్రమము యొక్క ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు. టీమ్ లను సూపర్వైజ్ చేసేందుకు జిల్లా నుండి ఒక సీనియర్ అధికారిని మండల నోడల్ ఆఫీసర్ గా నియమించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు..రెవెన్యూ సదస్సుల కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ కోఆర్డినేటర్ గా ఉంటారన్నారు.. షెడ్యూల్ ఫైనల్ అయిన తర్వాత ప్రజా ప్రతినిధులకు, రైతు సంఘాలకు, టీమ్ లకు అందచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.. పబ్లిసిటీలో భాగంగా రెవెన్యూ సదస్సుల వివరాలతో కరపత్రాలను తెలుగులో తయారుచేసి, సదస్సు నిర్వహణకు రెండు రోజులు ముందుగానే ఆయా గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు టామ్ టామ్ ద్వారా ప్రజలకు తెలియచేయాలని సబ్ కలెక్టర్, ఆర్డీఓ లను కలెక్టర్ ఆదేశించారు. సదస్సుల్లో రెవెన్యూ సదస్సులు పెద్ద గ్రామాలైతే ఒకరోజు, చిన్న గ్రామాలైతే సగం రోజు నిర్వహించే విధంగా సంబంధిత తహసిల్దార్లకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించే సమయంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను వెరిఫై చేసుకొనుటకు గాను ఆర్ ఓ ఆర్, 1 బి, అడంగల్, వెబ్ ల్యాండ్ 1 బి, తదితర రికార్డులను తీసుకొని వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ప్రజల నుండి తీసుకున్న ప్రతి అర్జీకి ఎండార్స్మెంట్ ఇవ్వాలని, అదే విధంగా ఆన్లైన్ లో కూడా ఫీడ్ చేయాలన్నారు. అర్జిదారుడికి ఇచ్చే ప్రతి ఎండార్స్మెంట్ తెలుగు భాషలో స్పష్టంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. తీసుకున్న ప్రతి అర్జీని 45 రోజులలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మ్యూటేషన్స్ కి సంబంధించిన అర్జీలు రాగానే, ఆలస్యం కాకుండా వారితో అక్కడే దరఖాస్తు చేయించే విధంగా మీ సేవ కౌంటర్ ఒకటి ఏర్పాటు చేసుకోవాలన్నారు.. ప్రతి గ్రామానికి సంబంధించిన మ్యాప్ పెద్ద సైజులో తయారు చేయాలని అందులో పట్టా భూమి, ప్రభుత్వ భూమి, అటవీ భూమి, వక్ఫ్ బోర్డ్ భూముల వివరాలను వివిధ రంగులలో రూపొందించి తయారు చేసే విధంగా సర్వేయర్ కి ఆదేశాలు జారీ చేయడంతో పాటు అబ్స్ట్రాక్ట్ కూడా రూపొందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒకవేళ ఏదైనా గ్రామాలలో రీ సర్వే జరిగినట్లయితే ఎల్ పి ఎం లను తీసుకొని వెళ్లాలన్నారు.. భూ హక్కు పత్రాలను ప్రజల నుండి తీసుకొని కొత్తగా వచ్చిన రాజముద్రతో ఉన్నటువంటి పాస్ పుస్తకాలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, సర్వే రాళ్లపై ఉన్నటువంటి బొమ్మలను తొలగించే విధంగా కూడా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. సదస్సుల్లో అధికారులు ఓపికగా వ్యవహరించి సమస్యలు పరిష్కరించే విధంగా ప్రజలకు సహకరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..పత్తికొండ ఎమ్మెల్యే కే ఈ శ్యాం బాబు మాట్లాడుతూ గత ఐదేళ్ళ కాలంలో పత్తికొండ మండలంలో దొంగ పాస్ పుస్తకాలు, ఆన్లైన్లో ఎక్కించుకోవడం లాంటి సంఘటనలు చాలా జరిగాయని, వీటిని పరిష్కరించే విధంగా పత్తికొండ టౌన్ లో రెవెన్యూ సదస్సు ఒక్కరోజు కాకుండా మూడు నుండి నాలుగు రోజులు నిర్వహించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ని కోరారు.

## దేవాలయల భూముల జోలికి వస్తే ఖబడ్దార్.

శ్రీ శ్రీశ్రీ రుక్మిణి పాండురంగ స్వామి దర్శించుకున్న ప్రముఖులు.






నందికొట్కూరు :=దేవాలయాల భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని బిజెపి రాష్ట్ర నాయకులు నంద్యాల జిల్లా బనగానపల్లె పల్లె అసెంబ్లీ ఇంచార్జ్ బివి సుబ్బారెడ్డి అన్నారు., ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చల్ల దామోదర్ రెడ్డిలు హెచ్చరించారు. అనంతరం వివాదాస్పదంలో ఉ న్నటువంటి స్థలాన్ని పరిశీలించి బివి సుబ్బారెడ్డి , చల్ల దామోదర్ రెడ్డి ,మాట్లాడుతూ ,జనవరి 22వ తారీఖున 1997 లో శ్రీ శ్రీ శ్రీ రుక్మిణి పాండురంగ స్వామి దేవాలయానికి శ్రీ సత్యనారాయణ గౌడ్ లేఅవుట్ నందు ఉపయోగకరంగా మిగులు స్థలాన్ని ఫిబ్రవరి నెల 13వ తారీకున 1997న ఆనాటి కలెక్టర్ తీర్మానంతో శ్రీ పాండురంగ స్వామి టెంపుల్ కు ఇవ్వడం జరిగింది. ముందుగా గర్భగుడి 20 అడుగుల కాంపౌండ్ నిర్మించుకొని మిగులు స్థలాన్ని కొంతమంది వ్యక్తులకు 2013లో 2014లో అగ్రిమెంట్ రాసుకొని వారికి ఖాళీ స్థలం అప్పగించడం జరిగింది కొంతకాలంగా వాళ్ళు లిజ్ అమౌంట్ చెల్లించకపోవడంతో పాండురంగ స్వామి దేవాలయ కమిటీ వారు మీరు ఖాళీ చేయండి మేము కాంపౌండ్ వాల్ పెద్దగా చేసుకోవాలి అని వారిని కాళీ చేయించే ప్రయత్నం చేయగా ఈ స్థలం మీకు సంబంధం లేదు మీది కాదు మేము మున్సిపాలిటీలో పన్ను కడుతున్నాము మున్సిపాలిటీకి సంబంధించిన స్థలం ఇది అని చెప్పేసి కొత్త వివాదం తీసుకొచ్చారు. పాండురంగ స్వామికి సంబంధించి స్థలం పూర్తి అవగాహనలేని కొంతమంది కమ్యూనిస్టులు మేము పన్ను కట్టమని దేవాలయస్థలాన్ని కబ్జా చేయడానికి చూస్తే ఖబర్దార్ కమ్యూనిస్టుల్లారా ఎక్కడైనా సరే దేవాలయాల ఆస్తుల జోలి వెళితే మీ అంతు చూస్తామని గట్టిగా హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి గూడూరు రవికుమార్ రెడ్డి , నందికొట్కూరు కోఆర్డినేటర్ శంకర్ గౌడ్ , బిజెపి పట్టణ కార్యదర్శి వడ్డే వేణుగోపాల్ , బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు గద్దాలే శ్రీకాంత్ రావు ,బిజెపి కార్యవర్గ సభ్యులు , పి రామచంద్రుడు , మిడుతూరు మండల బిజెపి నాయకులు రాజా రెడ్డి ,బిజెపి కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి , గోపాల్ యాదవ్ , బిజెపి ఓబీసీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు , అశ్విన్ కుమార్ , బిజెపి నాయకులు శ్రీకాంత్ , శ్రీధర్ , దేవాలయ కమిటీ సభ్యులు ,బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మంత్రులు నిమ్మల, పయ్యావుల తో కలిసి తుంగభద్ర డ్యామ్ ని సందర్శించిన ఎం.పి బస్తిపాటి నాగరాజు

గేట్ల నాణ్యత, మరమ్మత్తు ల పై అధికారులు తో సమీక్షించిన మంత్రులు, ఎం.పి





కర్నూలు ఆగస్టు 13:కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర జలాశయాన్ని ఏపీ జనవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లతో కలిసి కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు సందర్శించారు.. డ్యామ్ లో గేటు కొట్టుకుపోయిన ప్రదేశాన్ని మంత్రులతో కలిసి ఎం.పి పరిశీలించారు.. ఈ సందర్బంగా వారు అక్కడ జరుగుతున్న పునరుద్ధరణ పనుల పై ఆరా తీశారు.. అనంతరం గేట్ల నాణ్యత, మరమత్తుల పై అధికారులతో సమీక్షించి, గేటు కొట్టుకుపోయిన ప్రాంతంలో కొత్త గేటు ఏర్పాటు చేయడం పై ఇంజినీర్లతో మాట్లాడరు.. ఈ సంధర్భంగా ఎం.పి నాగరాజు మాట్లాడుతూ గేటు మరమ్మత్తు పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టి డ్యామ్ లో ని ప్రతి నీటి చుక్కను ఆదా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారన్నారు.. డ్యామ్ లో గేటు కొట్టుకుపోవడంతో నీరు వృధా గా పోతూ కర్నూలు, అనంతపురం, బళ్లారి జిల్లాల రైతులు నష్టపోవాల్సి వస్తుందని, రైతులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.. మంత్రులు, ఎం.పి తో పాటు గుంతకల్లు ఎం.ఎల్.ఏ గుమ్మనూరు జయరాం, ఆలూరు టిడిపి ఇంచార్జి వీరభద్ర గౌడ్ లు డ్యామ్ ని పరిశీలించారు..

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757